VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
AAERI QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20, INDIA
: 91(40) 27628104, 27674037
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 09, పేజీలు - 08
శుక్రవారం, జులై 3, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

# టీచర్లకూ మధ్యాహ్న భోజనం

## కేబినెట్ సంచలన నిర్ణయాలు

- సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ - మూసీ ప్రాజెక్టు మొదటి దశకు కేబినెట్ ఆమోదం
- ఆస్పత్రుల్లో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం పలు చారిత్రాత్మక, సంక్షేమ నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాబోయే రోజుల్లో రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే మౌలిక వసతుల ప్రాజెక్టులతో పాటు విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చేలా కేబినెట్ తీర్మానాలు చేసింది. ప్రధానంగా హైదరాబాద్ నగర ప్రతిష్టను గ్లోబల్ లెవెల్‌కు తీసుకెళ్లే మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మొదటి విడత పనులకు కేబినెట్ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 21 కిలోమీటర్ల మేర సాగే ఈ ఫేజ్-1 పనుల కోసం ఏకంగా రూ.7,345.12 కోట్ల భారీ బడ్జెట్‌ను క్లియర్ చేయడంతో పాటు, ఈ ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా 147 కొత్త పోస్టులను మంజూరు చేసింది. వైద్య రంగంలో నిరుద్యోగులకు సర్కార్ పెద్ద పీట వేసింది. హైదరాబాద్ నగర నలుమూలలా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు సనత్ నగర్, ఎల్‌బీ నగర్, అల్వాల్‌లతో పాటు వరంగల్‌లోని టీఐఎమ్ఎస్ ఆసుపత్రులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ఏకంగా 6,278 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, మరియు 4,235 అవుట్‌సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ భారీ నియామకాల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి దక్కడంతో పాటు, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం మరింత చేరువ కానుంది. విద్యాశాఖలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక అద్భుతమైన మానవీయ నిర్ణయానికి కేబినెట్ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు అందిస్తున్న ఉదయం అల్పాహారం , పాలు , మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని ఇకపై అక్కడ విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర నాన్-టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఉచితంగా వర్తింపజేయాలని నిర్ణయించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.50 లక్షల మంది విద్యాశాఖ సిబ్బందికి నేరుగా లబ్ధి చేకూరనుంది. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ చట్టంపై తెలంగాణ కేబినెట్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ చట్టం దేశ సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధంగా ఉందని మంత్రివర్గం అభిప్రాయపడింది. అయితే, ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో నిలిపివేస్తే.. గ్రామీణ

2లో..

# భారత్, జపాన్ బంధం మరింత బలోపేతం

## - ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే ఉమ్మడి లక్ష్యం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అత్యంత కీలకమైన, అతిపెద్ద ప్రజాస్వామ్య మార్కెట్ ఆర్థిక వ్యవస్థలైన భారత్ - జపాన్ దేశాల మధ్య రక్షణ, వ్యూహాత్మక సంబంధాలు సరికొత్త శిఖరానికి చేరాయి. ప్రపంచవ్యాప్తంగా అస్థిరమైన రాజకీయ, ఆర్థిక పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇరు దేశాల మధ్య ఉన్న పరస్పర నమ్మకమే అతిపెద్ద ఆస్తి అని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం జూలై 1 నుంచి 3 వరకు భారతదేశానికి విచ్చేసిన జపాన్ నూతన ప్రధానమంత్రి సనాయే తకైచితో హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ గురువారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అనంతరం ఇరు దేశాల నేతలు సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొన్ని దశాబ్దాలుగా ఆటోమొబైల్ నుండి

2లో..

# చర్చకు పిలిచి మొహం చాటేశారు

## మంత్రి జూపల్లిపై హరీశ్ రావు ఫైర్

- తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ నేతలు, గైర్హాజరైన మంత్రులు
- గన్ పార్క్ వద్దకు వెళ్తుండగా హరీశ్ రావు, ఇతర నేతల అరెస్ట్
- టెండర్లు, అప్పులపై చర్చకు కాంగ్రెస్ భయపడుతోందన్న బీఆర్ఎస్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ పోరు తీవ్రరూపం దాల్చింది. గురుకుల పాఠశాలల టెండర్లు, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసిరిన మంత్రి జూపల్లి కృష్ణారావు, తీరా సమయం వచ్చేసరికి వెనకడుగు వేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ముందుగా నిర్ణయించిన

2లో..



# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కీలక ప్రకటన

## - ఆందోళనలపై పూర్తి క్లారిటీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్, త్వరలో తీసుకురానున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై నెలకొన్న ఆందోళనలపై స్పష్టతనిచ్చింది. ఈ ఫీచర్ పూర్తిగా ఐచ్ఛికమని, వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేస్తూ అనేక జాగ్రత్తలు తీసుకున్నామని మెటా యాజమాన్యంలోని వాట్సాప్ వెల్లడించింది. ఈ ఫీచర్ ద్వారా మోసాలు,

2లో..

# ఆంధ్రప్రదేశ్‌లో వీబీజీ రామ్‌జీ పథకం ప్రారంభం

## - గ్రామాల్లో విప్లవం మొదలైందన్న సీఎం, డిప్యూటీ సీఎం!

అమరావతి (ప్రశ్న న్యూస్) వీబీజీ రామ్‌జీని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామని, ఇది గ్రామాల ముఖచిత్రం మార్చే కార్యక్రమమని సీఎం చంద్రబాబు వివరించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వీబీ జీరాంజీ ప్రారంభోత్సవం తిరుపతి జిల్లా ముక్కవారిపల్లెలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ మెరుగైన సవరణలతో వీబీ జీరామ్‌జీని మళ్లీ తీసుకొచ్చారని తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ అగ్రగామిగా ఎదుగుతోందని కొనియాడారు. వీబీ జీరాంజీ కోసం కేంద్రం రూ.7,700 కోట్లు, రాష్ట్ర వాటా 4 వేల కోట్లు మొత్తం 11 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు సీఎం వివరించారు. వీబీజీ రామ్‌జీని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామన్నారు. పని రోజులు వంద నుంచి 125 రోజులకు పెంచడం సంతోషించే విషయమని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. వీబీ జీరామ్‌జీ కింద

2లో..



# చేతగానోల్లు ఎందుకు మాట్లాడాలి.?

## - సవాల్ చేసి వెనక్కి తగ్గారన్న కేటీఆర్

- అసలు జూపల్లి కృష్ణారావును అడిగింది ఎవరు.? - రాహుల్ గాంధీ, రేవంత్ లకు సవాల్ చేసామన్న కేటీఆర్
- సందట్లో సడేమియాలా జూపల్లి దూరిండు - దమ్ముంటే చర్చను అసెంబ్లీలో పెట్టండి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి చివరకు గన్‌పార్క్‌కు వెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. సవాళ్లు విసిరే ముందు వాటిని నిలబెట్టుకునే ధైర్యం ఉండాలని అన్నారు. గన్‌పార్క్‌కు వెళుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రభుత్వానికి ఏ అంశంపైనా బహిరంగ చర్చ చేపట్టే ధైర్యం లేదని ఆరోపించారు. హరీశ్‌రావు సహా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందే అన్ని వాస్తవాలు చెప్పాలని భావించినా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్పీకర్ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు గన్‌పార్క్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తన సవాల్ కేటీఆర్, హరీశ్‌రావులకు కాదని తెలిపారు. నేరుగా కేసీఆర్‌కేనని స్పష్టం చేశారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు.

# స్పీడ్ పోస్టులో గంజాయి దందా

- ముఠా గుట్టురట్టు చేసిన హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్
- ఝార్ఖండ్ కేంద్రంగా దేశంలోని 21 రాష్ట్రాలకు డ్రగ్స్ పంపిణీ
- 'మందులు' అని చెప్పి పార్శిళ్లలో గంజాయి ప్యాక్ చేసి దందా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత తపాలా శాఖకు చెందిన స్పీడ్ పోస్ట్ సేవలను అడ్డంపెట్టుకుని దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా చేస్తున్న భారీ అంతరాష్ట్ర ముఠా గుట్టును హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు రట్టు చేశారు. ఝార్ఖండ్ కేంద్రంగా సాగుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయడంతో పాటు,

2లో..

# బండ రాళ్లపై పడేసి, కారు డోరుకేసి గుద్ది

- ఉప్పల్ భాగాయత్‌లో ఉద్రిక్తత
- తెలంగాణ రక్షణ సేన భూపోరాటంలో కవితకు గాయాలు
- కల్వకుంట్ల కవిత బలవంతపు అరెస్ట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన, పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ గురువారం ఉప్పల్ భగాయత్ వేదికగా తలపెట్టిన భూపోరాటం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు ఈ ఆందోళనలో పాల్గొనేందుకు తరలి రావడంతో ఉప్పల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ప్రభుత్వ ఇళ్ల స్థలాన్ని తక్షణమే కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నిరసన చేపట్టారు. ముందస్తు వ్యూహంలో భాగంగా ఉప్పల్ భగాయత్ గ్రౌండ్స్‌లో నిర్వహించాలనుకున్న భూపోరాట సభను పోలీసులు భారీ బారికేడ్లతో అడ్డుకోవడంతో కవిత తన వ్యూహాన్ని మార్చారు. ఎలాగైనా నిరసన గళాన్ని వినిపించి తీరుతామని సభా వేదికను మేడిపల్లి - చెంగిచెర్ల, బోడుప్పల్ సరిహద్దుల్లో ఉన్న భగయత్ నగర్ మైదానానికి మార్చారు. కవిత నేతృత్వంలో కార్యకర్తలంతా ఒక్కసారిగా ఆ ప్రాంతానికి దూసుకెళ్లడంతో అక్కడ ఒక్కసారిగా హైడ్రామా నెలకొంది. అయితే అప్పటికే విషయం తెలుసుకున్న వందలాది మంది పోలీస్ బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఆందోళనకారులను నిలువరించే ప్రయత్నం


2లో..

# వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

## - కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వంపై బండి సంజయ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గురుకుల టెండర్లలో అవకతవకలు, రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చోటుచేసుకున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు

2లో..



# నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది



- ప్రజల జీవితాల్లో మార్పే అభివృద్ధికి అసలైన కొలమానం అని చంద్రబాబు స్పష్టీకరణ
- అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించిన కేంద్ర ఆర్థిక సలహాదారులు

అమరావతి (ప్రశ్న న్యూస్) తాను ఆర్థిక శాస్త్రం చదివినప్పటికీ, పుస్తకాల కంటే సమాజం, ప్రజల నుంచే ఎక్కువ నేర్చుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే కాకుండా, ఆ వృద్ధి పేదల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొస్తోందన్నదే ప్రభుత్వానికి అసలైన కొలమానమని స్పష్టం చేశారు. డేటా ఆధారిత పాలన, సమర్థవంతమైన పరిపాలన ద్వారానే రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న 'ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్' రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో గురువారం ఆయన

2లో..

## టీచర్లకూ మధ్యాహ్న భోజనం

ప్రాంతాల్లోని ఉపాధి హామీ కూలీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే, కూలీల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, జూలై 1, 2026 నుండి తాత్కాలికంగా ఈ చట్టాన్ని తెలంగాణలో అమలు చేయాలని నిర్ణయిస్తూనే.. కేంద్ర వైఖరిపై సుప్రీంకోర్టులో చట్టపరమైన పోరాటం చేయాలని, అలాగే రాబోయే పార్లమెంట్ సమావేశాలలో ఈ అంశాన్ని గట్టిగా నిలదీయాలని కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది.రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు, పంటల నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా వరంగల్, రంగారెడ్డి జిల్లాలలో లభ్యంగా ఉన్న 60 ఎకరాల ప్రభుత్వ భూమిని తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌కు గోదాముల నిర్మాణం కోసం కేటాయించారు. దీనితో పాటు, గ్రామీణ ప్రాంతాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే సంకల్పంతో మహబూబ్ నగర్, సూర్యాపేట జిల్లాలలో రెండు కొత్త జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు, అలాగే జగిత్యాల జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి అవసరమైన భూములను కేటాయిస్తూ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంది.

## భారత్, జపాన్ బంధం మరింత బలోపేతం

ఎలక్ట్రానిక్స్ రంగం వరకు భారత్ వృద్ధిలో జపాన్ ఒక నమ్మకమైన భాగస్వామిగా నిలిచిందని, నేటి తకైచి పర్యటనతో ఈ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో సరికొత్త అధ్యాయం మొదలైందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

### రక్షణ రంగంలో చారిత్రాత్మక మైలురాయి

భారత్-జపాన్ రక్షణ సాంకేతిక భాగస్వామ్యంలో భాగంగా ఇరు దేశాలు తొలిసారిగా సంయుక్త అభివృద్ధి ప్రాజెక్టుపై సంతకాలు చేశాయి.
యూనికార్న్ ప్రాజెక్ట్: నౌకాదళానికి ఉపయోగపడే 'నావల్ రేడియో యాంటెన్నా యూనికార్న్' సాంకేతికతను ఇరు దేశాలు ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నాయి.
ప్రాంతీయ శాంతి: ఈ జాయింట్ ప్రాజెక్ట్ ద్వారా అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడి ఉంటూ, సముద్ర తీర భద్రతను మెరుగుపరచడం మరియు ప్రాంతీయ శాంతిని కాపాడటం సాధ్యమవుతుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

### ప్రధాని మోదీ నా 'పెద్దన్న'.. జపాన్ పీఎం ప్రశంసలు

జపాన్ ప్రధాని సనాయే తకైచి మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యవహారాలు గందరగోళంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత్, జపాన్ దేశాలు తమ సొంత బలాలను ఉపయోగించుకుంటూ మరింత బలంగా, సంపన్నంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి స్థాపనకు సముద్ర భద్రతా సహకారాన్ని విస్తరించడం చాలా ముఖ్యమని ఆమె నొక్కిచెప్పారు.ఉమ్మడి విన్యాసాలు: భారత్, జపాన్ నౌకాదళాలు త్వరలోనే హిందూ మహాసముద్రంలో ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహించనున్నాయని తకైచి వెల్లడించారు.మేక్ ఇన్ ఇండియా' ఫ్రేమ్‌వర్క్ కింద రక్షణ పరికరాల తయారీ, నౌకల నిర్మాణం, ఏఐ వంటి రంగాలలో సహకారాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. దీని కోసం ఈ ఏడాది చివరి నాటికి భారత్-జపాన్ '2o2' (విదేశీ, రక్షణ మంత్రుల) సమావేశాన్ని నిర్వహించాలని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు ఆమె చెప్పారు.75వ వార్షికోత్సవం: 2027 నాటికి భారత్-జపాన్ దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తి కానున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీని తన 'పెద్దన్న'గా సంబోధిస్తూ, ఆయనతో కలిసి తాము ఈ ద్వైపాక్షిక సంబంధాలను సరికొత్త దశకు తీసుకువెళతామని తకైచి ఆశాభావం వ్యక్తం చేశారు.

### నిరంతర చర్చలు.. పటిష్ఠ బంధం

భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్య బంధం 1952లో ప్రారంభం కాగా, 2014లో ప్రధాని మోదీ అప్పటి జపాన్ ప్రధాని షింజో అబే హయాంలో ఇది 'స్పెషల్ స్ట్రాటజిక్ అండ్ గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్'గా రూపాంతరం చెందింది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక భద్రత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సాంస్కృతిక రంగాలలో 70కి పైగా చర్చా యంత్రాంగాలు పనిచేస్తున్నాయి. ఇటీవలే 2026 జూన్‌లో ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సమిట్ సందర్భంగా, అంతకుముందు 2025 నవంబర్‌లో జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన జీ20 సమిట్ వేదికగా కూడా మోదీ, తకైచి సమావేశమై పరస్పర సహకారంపై చర్చలు జరిపారు. తాజా పర్యటనతో ఇరు దేశాల మధ్య రక్షణ బంధం మరింత ఉక్కుపిడికిలిగా మారబోతోందని స్పష్టమవుతోంది.

# ఆంధ్రప్రదేశ్‌లో వీబీ గ్రామ్‌జీ పథకం ప్రారంభం

ఏ అభివృద్ధి పని అయినా చేసుకోవచ్చని భూసార పరిరక్షణ, రహదారులు, డ్రెయినేజీలు నిర్మించుకోవచ్చని సీఎం సూచించారు. దొంగ లెక్కలు రాసుకోవడానికి వీలు లేకుండా డిజిటల్ విధానం తెచ్చామన్నారు. పారదర్శకత కోసం రియల్‌టైమ్ మానిటరింగ్ ఉంటుందని స్పష్టం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ నాయకత్వంలో గ్రామాల రూపురేఖలు మారుతాయని సీఎం తెలిపారు. కొత్త ఆలోచనలు, విధానాలతో సమాజానికి మేలు చేసేలా సంకల్పించారని అన్నారు. 2024 ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13226 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు నెలకొల్పిన ఘనత పవన్‌ది సీఎం చంద్రబాబు వివరించారు. 7 వేల కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటితొట్టెలు నిర్మించారన్నారు. కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేసిన ఘనత పవన్‌కల్యాణ్‌దని సీఎం గుర్తుచేశారు. కోడూరు-వెంకటగిరి రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బస్టాండ్ ఏర్పాటు ఆమోదం తెలిపారు. హార్టీకల్చర్ హబ్‌కు మదనపల్లెలో త్వరలోనే పునాది వేస్తున్నట్లు స్పష్టం చేశారు. గాలేరు-నగరి కాల్వ కోడూరుకు తీసుకొచ్చే బాధ్యత మాదని సీఎం భరోసా ఇచ్చారు. జలధార ద్వారా భూగర్భ జలాలను పెంచుకునేలా సంకల్పించామన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు అన్నారు. విశాఖకు రైల్వే జోన్ సాధించామని ఉత్తరాంధ్రకు గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని తెలిపారు.నరేగాలో 90-10 శాతం ఉండేదని, ఇప్పుడు రాష్ట్ర వాటా 40 శాతం ఉందని గడిచిన ప్రభుత్వ హయాంలో నిధులన్నీ దారి మళ్లించారని సీఎం ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ఉంది జాగ్రత్తగా ఉండాలని సీఎం ప్రజలకు సూచించారు. ఆ పార్టీ 'రోజుకో మాట మాట్లాడుతోంది. గతంలో మూడు ముక్కలాట ఆడారు. ఎన్నికలు అయిపోయాక మావిగన్ అంటున్నారు. మన రాజధాని అమరావతే అది దేవతల రాజధాని. అమరావతి రాజధానికి కేంద్రం సహకరిస్తోంది' అని చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వ పాలనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలకులు నిర్వీర్యం చేసిన 93 కేంద్ర పథకాలను తాము అధికారంలోకి రాగానే పునరుద్ధరించామని ఆయన తెలిపారు. జల్ జీవన్ మిషన్ సహా వివిధ పథకాలకు రూ. 28 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అమరావతి రాజధాని నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని అమరావతిని ఆపడం ఎవరి తరమూ కాదని తేల్చి చెప్పారు. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోందని వైఎస్సార్సీపీపై విరుచుకుపడ్డారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలోనే మాట నిలుపుకున్నామన్నారు. గొడ్డలి పార్టీ ఎన్నికల ముందు ఓ మాట, అయ్యాక మరో మాట మాట్లాడుతోందని ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు.

### పేదరిక నిర్మూలనలో భాగంగా వికసిత్ భారత్ జీరామ్‌జీ - పవన్

పేదరిక నిర్మూలనలో భాగంగా వికసిత్ భారత్ జీరామ్‌జీ తీసుకొచ్చామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వీబీ జీరాంజీ కార్యక్రమం తిరుపతి జిల్లా ముక్కవారిపల్లె వేదికగా ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పవన్ మాట్లాడుతూ ఏపీ గ్రామీణాభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. ప్రధాని మోదీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని తెలియజేశారు. ఉపాధి శ్రామికులకు అదనంగా 25 రోజులు భరోసా కల్పించడం ముఖ్యమైందని పవన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రామికుల కొరత రాకుండా వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు విరామం రైతులకు ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలుకు మొత్తం రూ.12,845 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పవన్ వివరించారు.

## నాగారం కాంగ్రెస్‌లో అధ్యక్ష నియామకంపై రగడ

- బంధుత్వం ఆధారంగా పదవి ఇచ్చారంటూ సీనియర్ నాయకుల ఆరోపణలు
- పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అన్యాయం జరిగిందని ఆవేదన

కీసర (ప్రశ్న న్యూస్) జిల్లాలోని పలు డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించిన నేపథ్యంలో నాగారం డివిజన్ అధ్యక్షుడిగా ఎలసాని భూమయ్య యాదవ్ నియామకాన్ని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు వ్యతిరేకించారు.వారు మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేసిన సీనియర్ కార్యకర్తలను పక్కనపెట్టి, బంధుత్వానికి ప్రాధాన్యం ఇచ్చి నియామకం చేపట్టారని ఆరోపించారు. దీంతో నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.చిన్నంరాజు సతీష్ గౌడ్ మాట్లాడుతూ, తాను 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో సేవలందిస్తున్నప్పటికీ, పదవి దక్కలేదని, అయితే బంధుత్వం ఆధారంగా డివిజన్ అధ్యక్ష పదవి ఇవ్వడం బాధాకరమని అన్నారు.మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ 1978 నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులకు కనీస గౌరవం ఇవ్వకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. నాగారం మున్సిపల్ పరిధిలో పలువురు కార్యకర్తలు ఈ నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, దాసోహం నర్సింగ్‌రావు, బాలు యాదవ్, దాసరి రాంరెడ్డి, కిట్టు యాదవ్, సత్యనారాయణ యాదవ్, రవి, పంగ శ్రీహరి, గౌస్, ప్రవీణ్ యాదవ్, రామాగోని శ్రీనివాస్ గౌడ్, మనోహర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కీలక ప్రకటన

నకిలీ ఖాతాల బెడద పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవడం, భారత ప్రభుత్వం కూడా దీనిపై వివరణ కోరడంతో వాట్సాప్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు భారత్‌లో ఈ ఫీచర్ ప్రారంభాన్ని వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.

### భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్న వాట్సాప్

యూజర్‌నేమ్ ఫీచర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న ఆందోళనలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు వాట్సాప్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పలు కీలక విషయాలను వెల్లడించింది. వినియోగదారులందరూ తప్పనిసరిగా యూజర్‌నేమ్ క్రియేట్ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇది కేవలం అదనపు సౌకర్యం మాత్రమేనని, ఫోన్ నంబర్ ద్వారానే వాట్సాప్ వాడకాన్ని కొనసాగించవచ్చని తెలిపింది. ముఖ్యంగా ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రభుత్వ సంస్థలు, అలాగే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఇప్పటికే వెరిఫైడ్ ఖాతాలు ఉన్నవారి యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసినట్లు వాట్సాప్ పేర్కొంది. అంటే ఆ పేర్లను కేవలం వారి అసలైన యజమానులు మాత్రమే క్లెయిమ్ చేసుకోగలరు. తద్వారా ఇతరులు వారి పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడే అవకాశం ఉండదని భరోసా ఇచ్చింది. పాపులర్ పేర్లను ఎవరైనా రిజర్వ్ చేసుకోవచ్చని వస్తున్న వార్తల్లో నిజం లేదని కొట్టిపారేసింది.

### అపరిచితుల నుంచి రక్షణకు ప్రత్యేక ఫీచర్లు

ఈ ఏడాది చివర్లో యూజర్‌నేమ్ ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, అపరిచిత యూజర్‌నేమ్ నుంచి మెసేజ్ వస్తే వినియోగదారులకు కొన్ని అదనపు వివరాలు కనిపిస్తాయని వాట్సాప్ వివరించింది. సందేశం పంపిన వ్యక్తి ఏ దేశానికి చెందినవారు, వారి వాట్సాప్ ఖాతా కొత్తదా పాతదా, ఇద్దరికీ ఉమ్మడిగా ఏవైనా గ్రూపులు ఉన్నాయా వంటి సమాచారం కనిపిస్తుంది. ఈ వివరాల ఆధారంగా ఆ సందేశానికి స్పందించాలా వద్దా అని యూజర్ నిర్ణయించుకోవచ్చు. ఫోన్ నంబర్ల మాదిరిగా యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసి కాంటాక్ట్ చేసే అవకాశం ఉండదని, ఇది వినియోగదారుల ప్రైవసీకి మరింత రక్షణ కల్పిస్తుందని పేర్కొంది. అదనపు భద్రత కోసం 'యూజర్‌నేమ్ కీ' అనే మరో ఫీచర్‌ను కూడా పరిచయం చేయనున్నట్లు, దీనిని ఎనేబుల్ చేసుకుంటే యూజర్‌నేమ్‌తో పాటు ఈ ప్రత్యేక కీ కూడా ఎంటర్ చేస్తేనే ఇతరులు సంప్రదించగలరని వివరించింది.

### భారత ప్రభుత్వ ఆదేశాలు

అంతకుముందు ఈ కొత్త యూజర్‌నేమ్ ఫీచర్‌పై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని వాట్సాప్‌ను ఆదేశించింది. ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, ఆమోదం పొందే వరకు ఈ ఫీచర్‌ను భారత్‌లో ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలోనే వాట్సాప్ ఈ వివరణ ఇస్తూ, ప్రస్తుతానికి భారత్‌లో ఈ ఫీచర్ విడుదల ప్రణాళికను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

# వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి గన్ పార్క్ వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా నెలకొంది. ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న వ్యవహారం 'బిగ్ బాస్' షోను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పైకి పోరాటంలా కనిపిస్తున్నా, లోపల ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఈ రెండు పార్టీల అవినీతి, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' తప్పదని, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ రావడం ఖాయమని బండి సంజయ్ జోస్యం చెప్పారు.

## శ్రీవారి సేవలో గ్రూప్ సూపర్వైజర్లదే కీలక బాధ్యత

- రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన: టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి





తిరుమల(ప్రశ్న న్యూస్) తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న శ్రీవారి సేవ కార్యక్రమంలో గ్రూప్ సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమని టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని సేవాసదన్-2లో గురువారం ప్రారంభమైన శ్రీవారి సేవ గ్రూప్ సూపర్వైజర్ల రెండో విడత శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో 2000 సంవత్సరంలో ప్రారంభమైన శ్రీవారి సేవ కార్యక్రమం నేటికీ భక్తులకు విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. శ్రీవారి సేవకులకు వారి ప్రాంతాల్లోనే సమర్థవంతమైన శిక్షణ అందించేందుకు గ్రూప్ సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఇప్పటికే తొలి విడతలో 1,400 మంది గ్రూప్ సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వగా, రెండో విడతలో మరో 2,600 మందికి శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కోసం ఐఐఎం--అహ్మదాబాద్ సహకారంతో ఆధ్యాత్మికతతో పాటు నిర్వహణ నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ మెటీరియల్ రూపొందించామని తెలిపారు.గ్రూప్ సూపర్వైజర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని శ్రీవారి సేవకులను సమర్థవంతంగా నడిపించాలని, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బాధ్యత, సహనం, సేవాభావంతో పనిచేయాలని సూచించారు. టీటీడీ వ్యవస్థపై సంపూర్ణ అవగాహన కలిగి భక్తులకు అవసరమైన సమాచారం అందించడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవ విభాగాధిపతి డాక్టర్ టి. రవి, శిక్షకులు డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్, డాక్టర్ శరత్ కుమార్, పొలమడ రమేష్ బాబు, శ్రీవారి సేవ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## చర్చకు పిలిచి మొహం చాటేశారు

ప్రకారం చర్చ కోసం తాము తెలంగాణ భవన్‌కు చేరుకున్నా, మంత్రి రాకపోవడంపై ఆయన మండిపడ్డారు. గురువారం హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గన్ పార్క్ వద్ద ఉన్నారన్న సమాచారంతో వారు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది."చర్చకు రమ్మని సవాల్ విసిరింది వాళ్లే, తీరా మేము వస్తే పోలీసులను ప్రయోగించి అడ్డుకోవడం చూస్తుంటే, టెండర్లలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతోనే వారు పారిపోయారని స్పష్టమవుతోంది" అని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర అప్పు రూ. 8 లక్షల కోట్ల నుంచి రూ. 7 లక్షల కోట్లకు ఎలా తగ్గిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ఖాళీ కుర్చీ వేసి వేచి చూశారు. పోలీసుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులపాలైందని, భారీ స్థాయిలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు బహిరంగ చర్చకు సవాళ్లు విసురుకున్నారు.

## స్పీడ్ పోస్టులో గంజాయి దందా

హైదరాబాద్‌లో గంజాయి కొనుగోలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, ఝార్ఖండ్‌లోని గిరిడ్ జిల్లాకు చెందిన సత్యం మిశ్రా ఈ ముఠాను నడుపుతున్నాడు. స్థానికంగా లభించే గంజాయిని సేకరించి, 'ఔషధాలు' అని తప్పుడు డిక్లరేషన్‌తో పార్శిళ్లలో ప్యాక్ చేసి, స్పీడ్ పోస్ట్ ద్వారా దేశంలోని 21 రాష్ట్రాలకు పంపేవాడు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ, యూపీఐ ద్వారా నగదు స్వీకరించేవాడు. ఈ అక్రమ వ్యాపారం ద్వారా రోజుకు రూ. 1 లక్ష, నెలకు రూ. 30 నుంచి 35 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా వార్షిక టర్నోవర్ సుమారు రూ. 4 నుంచి 5 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఈ ముఠాలో సత్యం మిశ్రా సోదరుడు శుభం మిశ్రాతో పాటు మరికొందరు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఝార్ఖండ్ నుంచి పంపిన కొన్ని పార్శిళ్లను హైదరాబాద్‌లో అధికారులు అడ్డుకోవడంతో ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. నగరంలో పార్శిళ్లు అందుకున్న సుశాంత్ వ్యాస్, లడ్డూ అనే ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గుడిమల్కాపూర్, ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన పోస్టల్ సర్వీసుల్లోని భద్రతా లోపాలను ఎత్తిచూపుతోందని, పార్శిళ్లకు తప్పనిసరిగా స్కానింగ్ ప్రక్రియను అమలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నేతృత్వంలోని 22 మంది సభ్యుల బృందం ఈ ఆపరేషన్‌ను అత్యంత చాకచక్యంగా పూర్తి చేసింది.

## బండ రాళ్లపై పడేసి, కారు డోరుకేసి గుద్ది

చేశాయి.ఈ క్రమంలో పోలీసులకు, తెలంగాణ రక్షణ సేన శ్రేణులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. నిరసనకారులను చెల్లాచెదురు చేసేందుకు పోలీసులు గట్టిగా ప్రయత్నించడంతో అక్కడ లాఠీచార్జ్ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ తీవ్రమైన తోపులాట మధ్య కల్వకుంట్ల కవిత నియంత్రణ కోల్పోయి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమెకు చేతులు, మోకాళ్లకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రభుత్వం తాము అడిగిన న్యాయమైన డిమాండ్లపై చర్చించకుండా, ఇలా పోలీసులతో దాడులు చేయించడం ప్రజాస్వామ్యమా అని కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం అత్యంత నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు కవితను, ఇతర ముఖ్య నేతలను బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ వాహనాల్లోకి ఎక్కించారు. ఆమెను అదుపులోకి తీసుకున్న భద్రతా బలగాలు అక్కడి నుండి నేరుగా బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించాయి. తాము కేవలం ఎన్నికల హామీలను నెరవేర్చాలని శాంతియుతంగా పోరాడుతుంటే, ప్రభుత్వం లాఠీలు, రబ్బరు తూటాలతో భయపెట్టాలని చూస్తోందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని కవిత స్టేషన్ నుంచి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కవిత అరెస్ట్ వార్త తెలియడంతో బొల్లారం పోలీస్ స్టేషన్ వద్దకు టీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో అక్కడ భారీ భద్రతను ఏర్పాటు చేశారు.ఈ భూపోరాట పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడిని పెంచాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమాన్ని విస్మరించి, భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందని, కానీ తమ పార్టీ నిరుద్యోగులు, మహిళలు, ఉద్యమకారుల పక్షాన నిరంతరం పోరాడుతుందని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ ఘటనతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి 'తెలంగాణ రక్షణ సేన' క్షేత్రస్థాయిలో మరింత దూకుడుగా వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో విశ్లేషణలు వస్తున్నాయి.

## నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది

ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### పేదల జీవితాల్లో మార్పు కోసమే పాలన

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జీఎస్‌డీపీ, సీఏజీఆర్ వంటి ఆర్థిక సూచికలను విశ్లేషిస్తూనే, వాటి ఫలాలు ప్రజల జీవన ప్రమాణాలను ఎలా మెరుగుపరుస్తున్నాయో చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఇటీవలే గూడూరులో తాను పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మ కుటుంబాల స్థితిగతులను ఉదాహరణగా చూపుతూ, ప్రభుత్వ పథకాలు వారి జీవితాల్లో తెచ్చిన మార్పును సవివరంగా తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎలా నిలదొక్కుకుంటున్నాయో వివరించారు.

### దార్శనికతతో ముందుకు..

దేశంలోనే తొలిసారిగా విజన్-2020 రూపొందించినప్పుడు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని, కానీ భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి పనిచేశామని గుర్తు చేశారు. ఐటీ విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చి, సేవల రంగంలో అపార అవకాశాలు సృష్టిస్తుందని అప్పుడే విశ్వసించి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా దేశానికి ఒక విజన్ డాక్యుమెంట్ అవసరమని బలంగా నమ్మారని చెప్పారు. ప్రస్తుత యుగంలో డేటానే అసలైన సంపద అని, భవిష్యత్ మొత్తం డేటా ఆధారిత నిర్ణయాలపైనే నడుస్తుందని ఆయన పేర్కొన్నారు.

### టెక్నాలజీతో పారదర్శక పాలన

ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడంతో పాటు, రాష్ట్రంలో సంపద సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా అంతే కీలకమని చంద్రబాబు అన్నారు. అందుకే స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలన్నింటి సమాచారాన్ని ఒకే వేదికపైకి తెచ్చేందుకు 'డేటా లేక్' రూపొందిస్తున్నామని, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు హెల్త్ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసే 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు, సమాజం ద్వారా ఎదిగిన వారు తిరిగి సమాజానికి సేవ చేసేలా ప్రోత్సహించేందుకు 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు.

### అమరావతిలో క్వాంటం కంప్యూటర్

అనంతరం సభికులతో జరిగిన ముఖాముఖిలో సీఎం మాట్లాడుతూ.. తాను త్వరగా సంతృప్తి చెందే వ్యక్తిని కాదని, సంతృప్తి చెందితే అక్కడితో ఆగిపోతామని అన్నారు. ప్రజల కోసం నిరంతరం కొత్త విధానాలు, సాంకేతికతను అన్వేషిస్తూనే ఉండాలని సూచించారు.

"దేశం నాకేమిచ్చిందని కాకుండా, దేశానికి మనమేం చేశామని ఆలోచించాలి" అని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఒక కీలక ప్రకటన చేస్తూ, త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ఏపీ విధానాలపై నిపుణుల ప్రశంసలు

ఈ వర్క్‌షాప్‌లో భాగంగా జరిగిన ప్యానెల్ చర్చను ముఖ్యమంత్రి సభికుల మధ్య కూర్చొని ఆసక్తిగా తిలకించారు. ఈ చర్చలో పాల్గొన్న కేంద్ర స్టాటస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం, ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ తదితరులు ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్, పీ4 కార్యక్రమం, గ్రామస్థాయిలో డేటా సేకరణ వంటివి దేశంలోనే వినూత్నమైనవని, వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విలాసాగర్‌లో అమ్మవారి ప్రతిష్ఠకు సర్వం సిద్ధం

**- భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందండి**

**- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జూలై 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య తెలిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు, వివిధ ధార్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ భక్తులు కుటుంబ సమేతంగా అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదాలు పొందడంతో పాటు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వరుసగా రెండోసారి దమ్మాయిగూడ 4వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముప్పా రామారావు

**నాయకత్వంపై పార్టీ అధిష్ఠానం మరోసారి విశ్వాసం - కార్యకర్తల్లో హర్షం**



కీసర(ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ దమ్మాయిగూడ 4వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి ముప్పా రామారావును పార్టీ అధిష్ఠానం నియమించింది.

ఆయనపై పార్టీ అధిష్ఠానం మరోసారి విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కార్యకర్తల సమన్వయానికి మరింత కృషి చేసి పార్టీని విజయపథంలో నడిపించాలని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రయాణీకుల భద్రతే తెలంగాణ ఆర్టీసీ ధ్యేయం

**- జె.బి.ఎమ్ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు తాత్కాలిక నిలిపివేత**

**- హైదరాబాద్ బస్ భవన్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు**

**- 100% సేఫ్టీ సర్టిఫికేట్ వస్తేనే సర్వీసుల పునరుద్ధరణ**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో నడుస్తున్న జె.బి.ఎమ్ ఎలక్ట్రిక్ బస్సులలో వరుసగా హై వోల్టేజ్ బ్యాటరీ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణీకుల భద్రతను దృష్ట్యా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల పరిధిలో తిరిగే జె.బి.ఎమ్ సంస్థకు చెందిన ఎలక్ట్రిక్ బస్సుల కార్యకలాపాలను తాత్కాలిక నిలిపివేతకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది.గత నెల జూన్ 21వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కరీంనగర్ సమీపంలో అలుగునూర్ వద్ద జరిగిన బస్సు అగ్ని ప్రమాదము పై పూర్తి నివేదిక రాకమునుపే మరొక సంఘటన జరగడం వలన ప్రయాణీకులు, సిబ్బంది ఁ ప్రజల ప్రాణాల రక్షణే అత్యంత ప్రాధాన్యతగా భావించి, తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

### తదుపరి చర్యలు షరతులు..

తెలంగాణ ఆర్టీసీ జేబీఎం సంస్థను ప్రమాదాల విశ్లేషణ నివేదిక, శాశ్వత నివారణ చర్యలు, బ్యాటరీ ఫిట్నెస్ సర్టిఫికేషన్, హైదరాబాద్ బస్సు భవన్లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు, భద్రతకు సంబంధించిన పలు అంశాలపై స్పందించి తగు నివేదిక సమర్పించవలసిందిగా కోరడం జరిగిందన్నారు.

### పునరుద్ధరణపై నిర్ణయం..

ఆర్టీసీ విజ్ఞాపన పై స్పందించిన జె.బి.ఎమ్ సంస్థ పైన పేర్కొన్న పలు అంశాల పైన తక్షణమే నివేదికలు, సిద్ధం చేసేందుకై వారి టెక్నికల్ టీం, చైనా నుంచి బ్యాటరీ నిపుణుల బృందం కూడా ప్రమాద పరిస్థితులు వాటికి దారి తీసిన సందర్భాలను పరిశీలించి పలు నివారణ చర్యలపై నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు మరియు సంబంధిత నివేదికలను ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, సంస్థ నిర్దేశించిన అన్ని షరతులను జె.బి.ఎమ్. యాజమాన్యం పూర్తిగా పాటించినట్లు సంతృప్తి చెందిన పిదప, వారి టెక్నికల్ బృందం "వెహికల్ ఫిట్స్ ఫర్ ఆపరేషన్" అని ధృవీకరించిన వాహనాల పునరుద్ధరణ పై తుది నిర్ణయం తీసుకోబడుతుందన్నారు.ప్రజారవాణాలో భద్రత విషయంలో టీజీఎస్ ఆర్టీసీ ఎటువంటి రాజీ పడదని, ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణించేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని ఈ సందర్భంగా యాజమాన్యం స్పష్టం చేసింది.

## సిఐటియు నాయకుల అరెస్టులకు నిరసనగా ధర్నా

**చిట్వేలి** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగంపేటలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విబి జి రాంజీ పథకంగా పేరు మార్చుతూ నేడు ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వేకోడూరులో సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ ను, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మణి ని చిట్వేలి లో పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయం అని సిఐటియు చిట్వేలి మండల కన్వీనర్ వై. సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబిలి పెంచలయ్య తీవ్రంగా ఖండించారు. చిట్వేలి ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వారు మాట్లాడుతూ వాస్తవాలను ప్రశ్నిస్తున్నందుకు సమాధానం చెప్పలేక, ఇలా ఉద్యమాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఉపాధి హామీ చట్టం 2006లో వామపక్షాల పోరాటంతో సాధించారని. దాన్ని నిర్వీర్యం చేసేందుకు విబి జి రాంజీ పథకంగా మార్చి ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఇది ప్రారంభోత్సవం కాదని ముగింపు అని విమర్శించారు. 90 శాతం కేంద్ర నిధులతో చేపట్టే ఉపాధి చట్టం, పథకం గా మార్చి, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పడము అన్యాయం అన్నారు. రాష్ట్రం మూడు లక్షల కోట్లు అప్పుల్లో ఉంటే, మేము అంత బడ్జెట్ కేటాయించలేము అని ముఖ్యమంత్రి స్వయంగా చెబితే, ఈ పథకం ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. పెనగలూరు మండలం వెలకచర్ల లో ఉపాధి కూలీలు ఇద్దరుమృతి చెంది 50 మంది గాయపడి క్షతగ్రాత్రులు అయితే, ఘటన జరిగి రెండు నెలలైనా కనీసం ఒక్క రూపాయి నష్ట పరిహారం చెల్లించలేదన్నారు.

# రాజధాని ముఖద్వారంలో ట్రాఫిక్ నరకం

**ఉండవల్లి ప్రధాన రహదారిపై వాహనాల క్యూలు.**

**నిత్యం ప్రజలకు అవస్థలు**

**కోస్టల్ బ్యాంక్ టర్నింగ్ నుంచి శ్మశానం టర్నింగ్ వరకు 15 నిమిషాల ప్రయాణం.**

**శాశ్వత పరిష్కారం కోరుతున్న స్థానికులు**






ఉండవల్లి(ప్రశ్న న్యూస్) రాజధాని అమరావతికి ప్రధాన ప్రవేశ మార్గంగా ఉన్న ఉండవల్లి గ్రామ ప్రధాన రహదారి రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలకు కేంద్రంగా మారుతోంది. విజయవాడ--అమరావతి మధ్య రాకపోకలు పెరగడంతో వాహనాల రద్దీ తీవ్రస్థాయికి చేరి, స్థానిక ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉండవల్లిలోని కోస్టల్ బ్యాంక్ టర్నింగ్ నుంచి శ్మశానం టర్నింగ్ వరకు ఉన్న స్వల్ప దూరాన్ని దాటేందుకు సాధారణంగా 15 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. ఉదయం, సాయంత్రం కార్యాలయ వేళలు, పాఠశాలలు, కళాశాలల ప్రారంభం, ముగింపు సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రహదారిపై వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.అమరావతి రాజధాని ప్రాంతానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అయితే పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారి విస్తరణ, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర సేవల వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయని, దీంతో అత్యవసర పరిస్థితుల్లో విలువైన సమయం వృథా అవుతోందని ప్రజలు చెబుతున్నారు. రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు తగిన పోలీసు సిబ్బంది, సిగ్నల్ వ్యవస్థ, ప్రత్యామ్నాయ మార్గాల లేమి కూడా సమస్యను మరింత పెంచుతున్నాయని పేర్కొంటున్నారు.స్థానికులు, ప్రయాణికులు రహదారిని తక్షణమే వెడల్పు చేయాలని, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు శాస్త్రీయ ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాజధాని ప్రాంతానికి వెళ్లే కీలక మార్గం కావడంతో ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రాజధాని అభివృద్ధి వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, ఉండవల్లి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం అత్యవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు సమగ్ర ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించి, రహదారి విస్తరణతో పాటు ఆధునిక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## సీజీఎఫ్ నిధులతో దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట

**దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి**

**ప్రొద్దుటూరులో ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**

**సనాతన ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి**



ప్రొద్దుటూరు(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో దేవాలయాల పరిరక్షణ, పునరుద్ధరణ, ఆధ్యాత్మిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం పలు ఆలయాలను సందర్శించిన మంత్రి, కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ముందుగా ప్రొద్దుటూరులోని పప్పుల బజార్ వీధిలో నూతనంగా పునర్నిర్మించిన ను స్థానిక ఎమ్మెల్యే తో కలిసి సందర్శించిన మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణానికి సహకరించిన వారిని అభినందించారు .అనంతరం రాజుపాలెం మండలం వెల్లెల గ్రామంలోని శ్రీ చెన్నకేశవ,సంజీవరాయ స్వామి దేవస్థానం, శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానాలను సందర్శించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలకగా, ప్రత్యేక దర్శనం అనంతరం వేదాశీర్వచనాలు అందజేశారు.దర్శనానంతరం కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) ద్వారా మంజూరైన నిధులతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు మంత్రి, ఎమ్మెల్యే కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మరిన్ని ఆలయాల అభివృద్ధికి అదనపు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి కనీసం 30 దేవాలయాలను శ్రీవాణి ట్రస్ట్ కింద ప్రతిపాదించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు.హిందువుల మనోభావాలను గౌరవిస్తూ దేవాలయాల అభివృద్ధి, వైదిక సంప్రదాయాల పరిరక్షణ, సనాతన ధర్మ ప్రచారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

## కేంద్రీయ విద్యాలయానికి నూతన ముఖద్వారం

**రూ.15 లక్షల పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన**



నాదెండ్ల(ప్రశ్న న్యూస్)విద్యా సంస్థల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అన్నారు. నాదెండ్ల మండలం ఇర్లపాడులోని కేంద్రీయ విద్యాలయం నూతన ముఖద్వార నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అప్పాపురంలో వీబీజీ రామ్ జీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఇర్లపాడుకు చేరుకున్న ఎమ్మెల్యే, గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ నాయకులు, అధికారులతో కలిసి రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న కేంద్రీయ విద్యాలయం ముఖద్వార నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. పాఠశాలల అభివృద్ధి ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేందుకు ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గుర్రం నాగ పూర్ణచంద్రరావు, వజ్జ సింగయ్య, జయప్రసాద్, రంగనాథుల నాగేశ్వరరావు, కృష్ణమ నాయుడు, రామాంజీ, జ్యోతి, పంచాయతీరాజ్ డీఈ బాల కుమార్, ఏఈ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సుల తనిఖీలను ముమ్మరం చేసిన రవాణా శాఖ

**- రెండు వాహనాలపై కేసులు నమోదు - సీజ్**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎం.వీ.ఐ)వంశీధర్ తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు చేపట్టిన తనిఖీల్లో ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ (మెడికల్) కిట్, తాగునీటి సౌకర్యం, డ్రైవర్‌తో పాటు అటెండర్, ఎమర్జెన్సీ డోర్ తదితర భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వైపర్లు, రివర్స్ హారన్ తదితర వాహన పరికరాలు తప్పనిసరిగా పని చేసే స్థితిలో ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.గురువారం రెండు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

## ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర ఎంతో కీలకం

**డాక్టర్ రాజేశ్వరీ, డైరెక్టర్ రాష్ట్ర క్షయ శిక్షణా కేంద్రం**



అమీర్ పేట్ (ప్రశ్న న్యూస్)"వైద్యో నారాయణో హరి" రోగ నిర్ధారణ, చికిత్సలు, శస్త్రచికిత్సల నుండి పూర్తిగా స్వస్థత పొందే వరకు అత్యంత క్లిష్టమైన క్షణాలలో రోగులకు మార్గనిర్దేశం చేసే వైద్యుల సేవలను గుర్తించుకునే ప్రత్యేకమైన రోజే జాతీయ వైద్యుల దినోత్సవం. డాక్టర్స్ డే సందర్భంగా రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వరీ, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ చల్లాదేవి, వైద్యాధికారులు డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ దీప్తితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరీ మాట్లాడుతు దేశంలోనే అత్యంత ప్రముఖ వైద్యుడు, ప్రజా ప్రముఖుల్లో ఒకరైన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ గౌరవార్థం మనదేశంలో 1991 నుండి ప్రతి సంవత్సరం జూలై 1 న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ముఖ్యంగా ఈ రోజు, సమాజంలో వైద్యులు పోషిస్తున్న అంకితభావం, నిస్వార్థసేవ, ప్రజారోగ్య పరిరక్షణలో పోషిస్తున్న కీలక బాధ్యతలను గౌరవించుకునే సందర్భమని తెలుపుచు వైద్యాధికారులను అభినందించారు. ఈ సందర్బంలో రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రం, జిల్లా క్షయ శిక్షణ కేంద్రం సిబ్బంది, డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వరీ, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ చల్లాదేవి, వైద్యాధికారులు డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ దీప్తి లకు శుభాకాంక్షలు తెలిపారు.

## బండ్లగూడలో ఘనంగా ప్రారంభమైన ఫస్ట్ రైడ్ స్కేటింగ్ అకాడమీ

**- ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్**

**- కోచ్ రోహన్ ఆధ్వర్యంలో స్కేటింగ్ శిక్షణకు శ్రీకారం**



కీసర(ప్రశ్న న్యూస్ ) కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో ఫస్ట్ రైడ్ స్కేటింగ్ అకాడమీ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి బండ్లగూడ మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి అకాడమీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, సాయంత్రం జరిగిన ప్రారంభోత్సవ వేడుకలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా గండి యాదగిరి గౌడ్ మాట్లాడుతూ, చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో స్కేటింగ్ వంటి క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు నాణ్యమైన క్రీడా శిక్షణ అందించే ఇటువంటి అకాడమీలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.అకాడమీలో కోచ్ రోహన్ ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతుల్లో స్కేటింగ్ శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

## యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా బోనాల శంకర్



కూకట్ పల్లి(ప్రశ్నన్యూస్)కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసి యువతలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బోనాల శంకర్‌ను తాజాగా కైతలపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించింది. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ, ప్రతి ఉద్యమంలో ముందుండే నాయకుడికి ఈ బాధ్యతలు అప్పగించడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బోనాల శంకర్ నియామకం ద్వారా కైతలపూర్ డివిజన్‌లో పార్టీ సంస్థాగతంగా మరింత బలపడుతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. స్థానిక సమస్యలపై ప్రజల తరపున పోరాడుతూ, యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షించడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారని నాయకులు పేర్కొంటున్నారు. త్వరలో డివిజన్ స్థాయిలో బూత్ కమిటీలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం.

## చర్చలకు పిలిచి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హత్య

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ అరెస్టులు : వంటేరు ప్రతాప్ రెడ్డి
- హరీష్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అరెస్టును తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నాయకులు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ భవన్‌లో బీసీ సంక్షేమంపై బహిరంగ చర్చలకు రావాలని స్వయంగా కాంగ్రెస్ మంత్రులు ఆహ్వానించి, చర్చలకు వచ్చిన మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను చర్చలు జరపకుండా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క ప్రధాన హామీని కూడా నెరవేర్చకుండా ఇప్పుడు ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో అప్పులు చేసినప్పటికీ రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడంలేదని, సంక్షేమ పథకాలు అస్తవ్యస్తంగా మారాయని అన్నారు. బీసీ సంక్షేమ నిధుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే బహిరంగ చర్చ నిర్వహించాలని, చర్చలకు వచ్చిన వారినే అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహనానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైతుబంధు బకాయిలు చెల్లించడంలో విఫలమైందని, రైతు బీమా కూడా సకాలంలో అందించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాజకీయ కక్ష సాధింపులకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందనా రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల దేవేందర్, హైదర్ పటేల్, స్వామి చారి తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా పర్యటన ముగించుకొని మాతృదేశానికి అనుమల్ల చంద్రమౌళి - వరలక్ష్మీ దంపతులు

- ఘన స్వాగతానికి ఏర్పాట్లు చేస్తున్న అనుమల్ల మిత్రబృందం



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు, సామాజిక సేవకులు అనుమల్ల చంద్రమౌళి -- వరలక్ష్మీ దంపతులు వేసవి విరామం సందర్భంగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగం చేస్తున్న తమ కుమారుడి వద్దకు వెళ్లి కొంతకాలం గడిపారు. పర్యటనను ముగించుకొని వారు నేడు (శుక్రవారం) మాతృదేశానికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా అమెరికాలోని విమానాశ్రయంలో వారి కుమారుడు, కోడలు చంద్రమౌళి దంపతులకు ఆప్యాయంగా వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ వారు స్వదేశానికి పయనమయ్యారు. ఇదిలా ఉండగా, చంద్రమౌళి దంపతుల రాక సందర్భంగా వారి మిత్రబృందం, అభిమానులు, శ్రేయోభిలాషులు ఘన స్వాగతం పలికేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు, విమానాశ్రయం నుంచి స్వాగత ర్యాలీ నిర్వహించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నట్లు, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయ, ప్రజా సేవా రంగాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న అనుమల్ల చంద్రమౌళి దంపతులకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరుకానున్నారని అనుమల్ల మిత్రబృందం తెలిపింది.

## గిరిజన చట్టాల రద్దు కుట్రలను అడ్డుకోవాలి

- 1/70 చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని రైతు కూలీ సంఘం డిమాండ్
- వీబీజీ రామ్ జీ, సూర్యఘర్ యోజనపై విమర్శలు.. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి




విజయవాడ (ప్రశ్న న్యూస్) గిరిజనులకు రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కులను పరిరక్షించే చట్టాలను రద్దు చేసే ప్రయత్నాలు గిరిజన సమాజాన్ని మోసం చేయడమేనని రైతు కూలీ సంఘం (ఏపీ) రాష్ట్ర నాయకత్వం ఆరోపించింది. గిరిజన ప్రాంతాల్లో భూమి, అటవీ హక్కులను బలహీనపరిచే చర్యలను తక్షణమే విరమించుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, రాష్ట్ర కార్యదర్శి డి. వర్మతో పాటు ఇతర నాయకులు మాట్లాడారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న పలు తీర్మానాలను మీడియాకు వెల్లడించారు. గిరిజనుల దీర్ఘకాల పోరాటాల ఫలితంగా అమల్లోకి వచ్చిన 1/70 చట్టాన్ని ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని వారు విమర్శించారు. రాష్ట్రంలో గిరిజనులు అధికంగా నివసిస్తున్న వందలాది గ్రామాలను ఇంకా షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించలేదని పేర్కొన్నారు. గమనిక: ఈ కథనంలో పేర్కొన్న ఆరోపణలు, డిమాండ్లు రైతు కూలీ సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో చేసిన ప్రకటనల ఆధారంగా ప్రచురించబడుతున్నాయి. ప్రభుత్వాల స్పందన లేదా అధికారిక వివరణ వేరుగా ఉండవచ్చు.

# దేశానికి దిశానిర్దేశం చేసిన ఏపీ

## రైల్వేకోడూరు నుంచి 'వీబీజీ రామ్ జీ'కి శ్రీకారం

- రూ.7.5 లక్షల కోట్ల గ్రామీణాభివృద్ధి మిషన్‌కు జాతీయ స్థాయిలో ప్రారంభం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఆవిష్కరణ
- ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధికి భారీ నిధులు.
- తోతాపురి మామిడి రైతులకు కేంద్రం అండ.. పీఎంఏవై, గ్రామీణ రహదారులకు రూ.422 కోట్ల మంజూరు



తిరుపతి(ప్రశ్న న్యూస్) దేశ గ్రామీణాభివృద్ధికి కొత్త అధ్యాయానికి ఆంధ్రప్రదేశ్ నాంది పలికింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (వీబీజీ రామ్ జీ)' పథకం గురువారం తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ముక్కావారిపల్లి గ్రామం నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంయుక్తంగా పథకాన్ని ప్రారంభించి, వీబీజీ రామ్ జీ పోర్టల్ను ఆవిష్కరించారు. పథకం ప్రారంభోత్సవంలో భాగంగా సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు లబ్ధిదారులకు జాబ్ కార్డులను పంపిణీ చేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ ప్రోత్సాహక గీతాన్ని విడుదల చేయగా, పథకానికి సంబంధించిన సమాచార పుస్తకాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు.

### భారం కాదు... భవిష్యత్తు కోసం బాధ్యత

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రైల్వేకోడూరు నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమవుతున్న ఈ పథకం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం నుంచి మరో రూ.4 వేల కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో రూ.11 వేల కోట్లకు పైగా వ్యయంతో గ్రామాల రూపురేఖలు మార్చే కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. 125 రోజుల ఉపాధి హామీతో రహదారులు, కాలువలు, డ్రైనేజీలు, ఫార్మ్ పాండ్లు, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, పండ్ల తోటలు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, పొలాలకు వెళ్లే డొంక రోడ్లు వరకు అన్ని అభివృద్ధి పనులు ఈ పథకం కింద చేపట్టవచ్చని సీఎం వివరించారు. జియోట్యాగింగ్, బయోమెట్రిక్ వంటి ఆధునిక సాంకేతికతతో పూర్తిస్థాయి పారదర్శకతను తీసుకువస్తామని స్పష్టం చేశారు.

### రెండేళ్లలో రాష్ట్రాన్ని గాడిన పెట్టాం

గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను తిరిగి పునరుద్ధరించామని సీఎం తెలిపారు. అమరావతి నిర్మాణం వేగంగా సాగుతోందని, పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామని వెల్లడించారు. విశాఖ రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్, పుట్టపర్తి ఫైటర్ జెట్ యూనిట్, తిరుపతిలో బుల్లెట్ మోటార్‌సైకిల్ తయారీ కేంద్రం, మదనపల్లిలో హార్టికల్చర్ హబ్ వంటి కీలక ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్' గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### రూ.7.5 లక్షల కోట్లతో గ్రామీణాభివృద్ధి

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి కోసం రూ.7.5 లక్షల కోట్లతో వీబీజీ రామ్ జీ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. తొలి విడతలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,700 కోట్ల కేంద్ర నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామసభలే అభివృద్ధి పనులను నిర్ణయించే విధంగా ఈ పథకాన్ని రూపొందించామని చెప్పారు. ఏపీకి మేనమామగా వచ్చాను"మధ్యప్రదేశ్‌లో నన్ను 'మామాజీ' అని పిలుస్తారు. ఇక ఆంధ్రప్రదేశ్‌కు కూడా నేను మేనమామనే" అంటూ సభలో చమత్కరించిన కేంద్ర మంత్రి, మేనమామ ఎప్పుడూ ఖాళీ చేతులతో రాడని అన్నారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 74,212 ఇళ్ల మంజూరు, పీఎం గ్రామీణ్ సడక్ యోజన కింద రూ.422 కోట్ల నిధులు మంజూరు చేసిన పత్రాలను సీఎం చంద్రబాబుకు అందజేశారు. అదే విధంగా 2.16 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేస్తుందని ప్రకటిస్తూ రైతులకు శుభవార్త చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున కనీసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ హంగులు

- నెల్లూరులో విద్యా విప్లవానికి శ్రీకారం
- పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యే లక్ష్యం
- మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



నెల్లూరు(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని స్థాయికి తీసుకెళ్లి, పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఆర్.ఎస్.ఆర్ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఆధునీకరణ పనులను గురువారం పరిశీలించిన మంత్రి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, పొంగూరు షరణితో కలిసి ఉపాధ్యాయులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యారంగాన్ని గాడిలో పెట్టి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. పాత రేకుల షెడ్ల స్థానంలో కోట్లాది రూపాయల వ్యయంతో 41 అత్యాధునిక తరగతి గదులను నిర్మించామని, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిరంతర సమీక్షలు నిర్వహిస్తూ, బోధన నాణ్యతను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కూడా ఆధునీకరించి, ప్రభుత్వ విద్యా రంగంలో నెల్లూరును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపు పలాసలో 'వికసిత్ భారత్ - జీ రామ్ జీ' ప్రారంభం

ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తాం
- ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస(ప్రశ్న న్యూస్)గ్రామీణాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, సహజ వనరుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ - జీ రామ్ జీ' కార్యక్రమాన్ని పలాస నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభించారు. పలాస మండలం తర్లకోట గ్రామం, మందస మండలం కుసుమల గ్రామాల్లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి, కూలీల సంక్షేమానికి, ఉపాధి హామీ పనుల్లో నాణ్యత, పారదర్శకత పెంపునకు ఈ కార్యక్రమం కీలకంగా మారనుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరవేసి ప్రభుత్వ సేవలను వేగవంతంగా అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. 'వికసిత్ భారత్ - జీ రామ్ జీ' ద్వారా గ్రామసభల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, 125 రోజుల ఉపాధి ప్రణాళిక అమలు, సహజ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం, శ్రమ ఆధారిత పనుల విస్తరణ, గ్రామస్థుల భాగస్వామ్యంతో ఆస్తుల సృష్టి వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్, ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇవ్వడమే లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్



విజయవాడ (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన నాయకులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడమే సంస్థాగత నిర్మాణం ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నాయకులను గుర్తించే అవకాశం తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నాలుగో రోజు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. సమాచార సేకరణ కమిటీ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జనసైనికులు, వీరమహిళలు భారీగా హాజరై తమ దరఖాస్తులను సమర్పించారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరితో మంత్రి దుర్గేష్ స్వయంగా మాట్లాడి, పార్టీ కోసం వారు చేసిన సేవలు, భవిష్యత్ కార్యాచరణపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, జనసేన పార్టీ లక్ష్యం కేవలం అధికారాన్ని సాధించడం మాత్రమే కాదని, సమాజ సేవకు అంకితభావంతో పనిచేసే నాయకత్వాన్ని తయారు చేయడమేనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి నుంచి వస్తున్న విశేష స్పందన పార్టీపై కార్యకర్తలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి సమర్థులు, నిబద్ధత కలిగిన నాయకులను గుర్తించి, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని వివరించారు. స్వీకరించిన అన్ని దరఖాస్తులను కూలంకషంగా పరిశీలించిన అనంతరం తుది నిర్ణయాన్ని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తీసుకుంటారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. జనసేన సంస్థాగత నిర్మాణ ప్రక్రియ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని, పార్టీ మరింత బలోపేతం కావడానికి ఈ కార్యక్రమం కీలకంగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీశైలంలో దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వెలసిన శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలు నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానం సేవగా నిర్వహించే ఈ కైంకర్యంలో ముందుగా మహాగణపతి పూజ జరిపి, అనంతరం పంచామృతాభిషేకం, విశేషార్చనలు నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తి స్వరూపంగా దత్తాత్రేయస్వామి అవతరించారని పురాణాలు చెబుతున్నాయని దేవస్థానం అధికారులు తెలిపారు. శ్రీశైల క్షేత్రంతో దత్తాత్రేయస్వామికి ప్రత్యేక అనుబంధం ఉందని, ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద స్వామివారు తపస్సు చేసినట్లు విశ్వాసం ఉందన్నారు. అలాగే కలియుగంలో లో శ్రీపాదవల్లభునిగా, అనంతరం మహారాష్ట్రలో నృసింహ సరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామి అవతరించినట్లు గురుచరిత్రలో పేర్కొనబడిందని వివరించారు. నృసింహ సరస్వతి స్వామి శ్రీశైలంలో చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించడంతో పాటు, చివరకు పాతాళగంగలో అవతార సమాప్తి చేసినట్లు ఆధ్యాత్మిక గ్రంథాల్లో ప్రస్తావన ఉందని తెలిపారు. ఈ విశేష పూజా కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, వేదపండితులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లా అగ్రస్థానంలో ఉండాలి

**- డీఎంహెచ్ఓ : డా. జి. ఎంజేలా అల్ఫ్రెడ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జి. ఎంజేలా అల్ఫ్రెడ్ అధికారులను ఆదేశించారు.వేములవాడలోని బస్తీ దవాఖాన, పాలియేటివ్ కేర్ కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులను తొలి త్రైమాసికంలోనే నమోదు చేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలకు ప్రోత్సహించాలని సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ మాత్రలు అందించడంతో పాటు, జిల్లాలో సిజేరియన్ ప్రసవాల శాతం అధికంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, యోగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు.30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించాలని, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రిలోని సైకియాట్రిస్ట్‌కు రిఫర్ చేయాలని ఆదేశించారు.పుట్టిన ప్రతి శిశువుకు పూర్తి టీకాలు అందేలా చూడాలని, క్షయవ్యాధి అనుమానితులకు పరీక్షలు నిర్వహించి పాజిటివ్‌గా తేలిన వారికి పూర్తి చికిత్స అందించాలని సూచించారు. అలాగే డెంగ్యూ తదితర కీటక జనిత వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొని, పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే ఫాగింగ్, క్రిమిసంహారక మందుల పిచికారీ చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా. నాగేంద్రబాబు, డా. రామకృష్ణ, డా. సంపత్ కుమార్, డా. అనిత, డా. వేణుగోపాల్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డీపీఓ రాజేందర్, కార్తీక్, మహేష్, రామనాథన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గంగపుత్ర గజ ఈతగాళ్ల సాహసం

**మంథని గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత**

**20 గంటలపాటు నిరంతర గాలింపు**

**బెస్తపల్లి సర్పంచ్ శ్రీనివాస్ నేతృత్వంలో గాలింపు**



మంథని(ప్రశ్న న్యూస్)పెద్దపల్లి జిల్లాలోని మంథని పట్టణంలోని శ్రీపాద కాలనీకి చెందిన కొమురయ్య బుధవారం గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగగా, నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో గల్లంతయ్యారు.సమాచారం అందుకున్న మంథని పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో తొలుత అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ కొమురయ్య ఆచూకీ లభించకపోవడంతో బెస్తపల్లి గ్రామానికి చెందిన గంగపుత్ర గజ ఈతగాళ్ల సహాయం కోరారు.వెంటనే స్పందించిన బెస్తపల్లి సర్పంచ్ అరిపల్లి శ్రీనివాస్ గంగపుత్ర నేతృత్వంలోని గజ ఈతగాళ్ల బృందం ఘటనాస్థలికి చేరుకుని గోదావరి నదిలో తీవ్రంగా గాలింపు చేపట్టింది. సుమారు 20 గంటలపాటు నిరంతర శ్రమ అనంతరం కొమురయ్య మృతదేహాన్ని వెలికితీశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరిపల్లి శ్రీనివాస్ గంగపుత్ర మాట్లాడుతూ, గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా గంగపుత్ర గజ ఈతగాళ్లు ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తూనే ఉన్నారని తెలిపారు. గజ ఈతగాళ్ల సేవలను స్థానికులు, పోలీసులు అభినందించారు.ఈ గాలింపు కార్యక్రమంలో అరిపల్లి శ్రీనివాస్ గంగపుత్ర, బోరె పోచమల్లయ్య గంగపుత్ర, మెడి పోచయ్య గంగపుత్ర, ఉట్నూరి లింగయ్య, మెడి నర్సయ్య గంగపుత్ర, కునారపు వెంకటేష్ గంగపుత్ర, తోకల రాజయ్య గంగపుత్ర, మండి సతీష్ గంగపుత్ర, బోరె లక్ష్మన్ గంగపుత్ర, ధర్మాజీ లింగయ్య గంగపుత్ర, గుమ్ముల రాజేశం గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

# రెయిన్బో హాస్పిటల్ వద్ద జర్నలిస్ట్ సూరన్న, గొర్లపల్లి సురేష్



హైదరాబాద్(ప్రశ్న న్యూస్)రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గుడ్లబోరి గ్రామానికి చెందిన చిన్నారి రియన్స్‌ను జర్నలిస్ట్ సూరన్న, గొర్లపల్లి సురేష్ కలిసి పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో నేరుగా మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.వైద్యుల ప్రకారం, రియన్స్ పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉన్నప్పటికీ, అత్యవసర చికిత్సను నిరంతరం కొనసాగిస్తే కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. అందుకే చికిత్సలో ఎలాంటి రాజీ పడకుండా అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తున్నామని వైద్య బృందం వివరించింది.జర్నలిస్ట్ సూరన్న, గొర్లపల్లి సురేష్ ఆసుపత్రిలోకి వెళ్లి చిన్నారి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ, "ఎంత ఖర్చు అయినా వెనుకాడకుండా అవసరమైన చికిత్స అందించండి. ఒక చిన్నారి ప్రాణం కాపాడటమే ఇప్పుడు అత్యంత ముఖ్యమైనది" అని కోరారు.
గుడ్లబోరి గ్రామానికి చెందిన కైలాష్--పూల దంపతుల కుమారుడు రియన్స్ ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్లిష్ట సమయంలో మానవత్వంతో ప్రతి ఒక్కరూ స్పందించి, తమ వంతు ఆర్థిక సహాయం అందించి ఆ చిన్నారి ప్రాణాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# వర్షిత విద్యాభ్యాసానికి చేయూతనిచ్చిన "మన చారిటబుల్ ట్రస్ట్"



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడకు చెందిన జిల్లా శ్రీనివాస్ కుమార్తె వర్షిత ఉన్నత చదువులు కొనసాగించేందుకు 'మన చారిటబుల్ ట్రస్ట్' రూ.6 వేల ఆర్థిక సహాయం అందించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో ట్రస్ట్‌ను ఆశ్రయించగా, నిర్వాహకులు వెంటనే స్పందించి ఆమె తండ్రి శ్రీనివాస్‌కు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు వర్షిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎస్ఐఆర్ పత్రాల పంపిణీలో కాంగ్రెస్ నాయకుల భాగస్వామ్యం



భీంగల్ (ప్రశ్న న్యూస్)నిజామాబాద్ జిల్లా,భీంగల్ పట్టణంలోని 162వ బూత్‌లో గురువారం ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 162వ వార్డు కాంగ్రెస్ బీఎల్ఏ బైండ్ల మహేష్, కాంగ్రెస్ నాయకుడు కాపు కుమ్మరి హరీష్, రెవెన్యూ అధికారి రాహుల్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ సర్వే ద్వారా ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలు సేకరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చేయడంతో పాటు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని తెలిపారు.

# యూరియా అక్రమ తరలింపుపై కఠిన చర్యలు ముగ్గురు ఎరువుల డీలర్ల లైసెన్సులు రద్దు

**- వ్యాపారి అరెస్ట్ - వ్యవసాయ అధికారి సస్పెండ్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)సబ్సిడీ యూరియాను రైతులకు పంపిణీ చేయకుండా అక్రమంగా పక్కదారి పట్టించిన ఘటనపై సిద్దిపేట జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆంజనేయ ఫర్టిలైజర్స్, గణేష్ ట్రేడర్స్ నుంచి మొత్తం 6,420 యూరియా బస్తాలను తీసుకుని రైతులకు సరఫరా చేయకుండా, రైతుల ఆధార్ వివరాలను వినియోగించి అక్రమంగా తరలించినట్లు గుర్తించారు.ఈ వ్యవహారంలో చేర్యాల పట్టణానికి చెందిన శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్ నిర్వాహకుడు సందీప్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.యూరియా అక్రమ సరఫరాలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన ఆంజనేయ ఫర్టిలైజర్స్, గణేష్ ట్రేడర్స్, శ్రీ సాయి శివ ఫర్టిలైజర్స్ సంస్థల ఎరువుల వ్యాపార లైసెన్సులను వ్యవసాయశాఖ రాష్ట్ర డైరెక్టర్ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు.ఈ ఘటనలో మరికొందరి ప్రమేయం ఉందనే అనుమానంతో వ్యవసాయశాఖ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోందని వెల్లడించారు. సబ్సిడీ యూరియాను దుర్వినియోగం చేసే వ్యాపారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.అదేవిధంగా, విధుల్లో నిర్లక్ష్యం వహించి రైతులకు అందాల్సిన సబ్సిడీ యూరియా అక్రమంగా పక్కదారి పట్టడంలో బాధ్యత వహించిన చేర్యాల మండల వ్యవసాయ అధికారి బోగేశ్వర్ స్వామిని జిల్లా కలెక్టర్ కే. హైమావతి సస్పెండ్ చేసినట్లు అధికారికంగా ప్రకటించారు.

# కవిత అరెస్టు ప్రజాస్వామ్యాన్ని గొంతుకోయడమే

**ఉద్యమకారులపై అక్రమ అరెస్టులు హేయమైన చర్య హామీలు అమలు చేయలేని ప్రభుత్వం.. ఉద్యమాలను అణచివేస్తుందా.?**

**తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి ధ్వజం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన భూ పోరాట కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు ఉద్యమకారులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి తీవ్రంగా విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, వాటిని ప్రశ్నించిన వారిపై అక్రమ అరెస్టులకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.ఉప్పల్ బాగాయత్‌లో చేపట్టిన భూ పోరాటాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అరెస్టులు ఉద్యమకారులకు కొత్త కాదని, ఎన్ని నిర్బంధాలు చేసినా ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.ఉద్యమకారుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కవితతో పాటు ఉద్యమకారుల అరెస్టులను తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, రాజు స్వామి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు నోరు అదుపులో పెట్టుకోవాలి

**లేకపోతే భౌతిక దాడులకు దిగుతాం**

**ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి**



ఓయూ (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, ఆధారాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, గురుకుల శాఖ మంత్రులపై చేస్తున్న ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తీవ్ర హెచ్చరిక చేశారు.గురుకులాల్లో రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందంటూ హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ వెల్ఫేర్ మంత్రి అజారుద్దీన్‌లపై హరీష్ రావు చేస్తున్న నిరాధార ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.గురుకులాల్లో అవినీతి జరిగిందని చెబుతున్న హరీష్ రావును గన్‌పార్క్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరినట్లు గుర్తు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసినా హరీష్ రావు, కేటీఆర్ ఎవరూ రాలేదని ఎద్దేవా చేశారు. నిజంగా దమ్ముంటే ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చి విద్యార్థుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.1200 మంది విద్యార్థుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. అలాంటి ఉస్మానియా గడ్డపై బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల లోపే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ భీమ్రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయల అవినీతి, కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. ఆ పాలనలో సొంత పార్టీ నాయకులకు మాత్రమే లబ్ధి చేకూరిందని, సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు.హరీష్ రావు సొంత కుటుంబానికి చెందిన కల్వకుంట్ల కవితే గతంలో ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు ప్రజాపాలనపై నిరాధార ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఇలాంటి ఆరోపణలను ప్రజలు సహించరని, ప్రజా వ్యతిరేక చర్యలకు తగిన సమాధానం తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దరువు రమేష్, యుగేందర్, రాజేందర్, కొమ్ము స్వామి, కొమ్ము సురేష్, బాబు, అరుణ్, రాజు, శ్రీనివాస్, రవి, చరణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నియామకం ఫైనల్: కూరంకున్నత్ రంజిత్ కుమార్.

**- ఏటూరునాగారం టౌన్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియమితులు. అధిష్ఠానం ఉత్తర్వులు జారీ.**

**- ప్రజా సమస్యలపై చురుగ్గా ఉన్న రంజిత్ కుమార్‌కు పార్టీ పెద్ద పదవి కట్టబెట్టడంతో కార్యకర్తల్లో హర్షం.**

**- ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తా" అని రంజిత్ కుమార్ స్పష్టం. యువతకు ప్రాధాన్యత ఇస్తానని వెల్లడి.**

**- బాధ్యతల అనంతరం మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపిన నూతన అధ్యక్షుడు.**

**- టౌన్‌లో కాంగ్రెస్‌ను బలపరిచి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన అజెండా అని రంజిత్ కుమార్ ప్రకటన.**



ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్)ములుగు జిల్లా ఏటూరునాగారం టౌన్ కాంగ్రెస్ కమిటీకి కొత్త నాయకత్వం లభించింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కూరంకున్నత్ రంజిత్ కుమార్‌ను ఏటూరునాగారం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.నియామకం వెలువడిన వెంటనే పట్టణంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రంజిత్ కుమార్ ఇంటికి చేరుకుని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## యువ నాయకుడికి గుర్తింపు

ప్రజా సమస్యలపై గత కొంతకాలంగా చురుగ్గా స్పందించి యువ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు రంజిత్ కుమార్. క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను, కష్టాన్ని గుర్తించిన పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యత అప్పగించడంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఇది యువతకు పార్టీలో అవకాశాలు ఇస్తున్నదానికి నిదర్శనమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

## ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు

నియామకం అనంతరం మీడియాతో మాట్లాడిన రంజిత్ కుమార్, తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యత ఇచ్చినందుకు రాష్ట్ర మంత్రి సీతక్క గారికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారికి అలాగే టౌన్‌లోని సీనియర్ నాయకులు, ప్రతి ఒక్క కార్యకర్తకు ధన్యవాదాలు అని అన్నారు. పార్టీని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన ఆయన, ప్రతి కార్యకర్తను కలుపుకొని, వారందరికీ అండగా నిలుస్తూ పార్టీని బలపరుస్తాను. ప్రజల వద్ద ఉన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాను. ముఖ్యంగా యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించి, టౌన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తాం" అని వెల్లడించారు.

## శ్రేణుల్లో నమ్మకం

రంజిత్ కుమార్ నాయకత్వంలో ఏటూరునాగారం టౌన్‌లో కాంగ్రెస్ పార్టీ కొత్త ఉత్సాహంతో ముందుకు వెళ్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా ఇది దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏసీబీ వలలో డీఎస్పీ భీంరెడ్డి


**- ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు, బంగారం - రూ.200 కోట్లకుపైగా ఆస్తులు..**

**- 2 కిలోల బంగారం, రూ.40 లక్షలు సీజ్**

**- 15 మంది బినామీలు - వందల కోట్లు దోచుకున్న అధికారులు**








**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులు వందల కోట్లు అక్రమ సంపాదన బయటపడడం చూస్తుంటే ఒక్కొక్క అధికారి ఎంత భారి స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు అర్థం చేసుకోవచ్చు. ఒక్క అధికారి కూడా నీతి నిజాయితీగా ఉద్యోగం చేయలేదా.? చేస్తే వందల కోట్లు ఎలా సంపాదించారు.? మరి నీతి, నిజాయితీ, న్యాయం కేవలం ప్రజలకే వర్తిస్తుందా.? అధికారులకు వర్తించదా.?ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ పోలీస్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సంకిరెడ్డి భీంరెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం హైదరాబాద్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ పర్యవేక్షణలో సుమారు 20 బృందాలు ఈ దాడులలో పాల్గొన్నాయి. హైదరాబాద్ శివారు నార్సింగిలోని 'వెస్సెల్లా మీడోస్'లో ఉన్న భీంరెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో విల్లాలు, పెంట్‌హౌస్‌లు, ఫ్లాట్లు, వాణిజ్య సముదాయాలు, ఖాళీ ప్లాట్లు మరియు వ్యవసాయ భూములకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.సోదాల సందర్భంగా రూ. 43.06 లక్షల నగదు, 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులను ఏసీబీ అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు గచ్చిబౌలి, తెల్లాపూర్‌లలో ఫ్లాట్లు, మణికొండలో నిర్మాణంలో ఉన్న వాణిజ్య సముదాయంలో వాటా, సంగారెడ్డి జిల్లాతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 45 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. అలాగే 'శ్రీ రాఘవేంద్ర రాక్ శాండ్ మినరల్స్'లో రూ. 75 లక్షల మేర పెట్టుబడులు పెట్టినట్లు నిర్ధారించారు. తెల్లాపూర్‌లో రెండు ప్లాట్లు, ప్రగతి రిసార్ట్స్ సమీపంలో 500 గజాల ప్లాట్, నాగోల్ కామినేని ఆసుపత్రి సమీపంలో 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు జీపీఆర్ హౌసింగ్ సొసైటీ పరిధిలో 400 గజాల ప్లాట్, వికారాబాద్ జిల్లా మొమిన్‌పేటలో 1,000 గజాల స్థలంతో పాటు వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 19.91 లక్షల నగదు నిల్వలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్) విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న భీంరెడ్డిని అదుపులోకి తీసుకుని అధికారికంగా అరెస్ట్ చేసినట్లు ఏసీబీ ప్రకటించింది. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మార్కెట్ విలువ కోట్లాది రూపాయల్లో ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తుండగా, ఆస్తులు పూర్తిస్థాయి లెక్కింపుఇంకా కొనసాగుతోంది.

## నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాల్లో చేపల వేట 61 రోజుల నిషేధం



**నరసరావుపేట** చేపల పునరుత్పత్తి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్, కె.ఎల్. రావు పులిచింతల జలాశయాల్లో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు మొత్తం 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమల్లో ఉంటుందని పల్నాడు జిల్లా మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ. ఎం.ఎస్. నెం.776 (ఆహార ఒ మత్స్యశాఖ) తో పాటు తదుపరి ఉత్తర్వుల మేరకు ప్రతి ఏడాది ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కాలంలో జలాశయాల్లో చేపలు గుడ్లు పెట్టే దశలో ఉండటంతో వాటి పునరుత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిషేధ కాలంలో ఎవరూ జలాశయాల్లో చేపల వేట చేపట్టరాదని, నిబంధనలను ఉల్లంఘించి వేట నిర్వహించినట్లయితే సంబంధిత లైసెన్సులను రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు. మత్స్యకారులు నిషేధ కాలాన్ని పూర్తిగా పాటించి చేపల సంపద పరిరక్షణకు సహకరించాలని మత్స్యశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన వీఆర్ లక్ష్మీరెడ్డి



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో గురువారం మీ భూమి మీ హక్కు కార్యక్రమాన్ని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ టిడిపి నాయకుడు వీఆర్ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజముద్రలతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అధికారులతో కలిసి టీడీపీ నాయకుడు వీఆర్ లక్ష్మీరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, ఇటిక్యాల శివారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## బద్వేల్ నగరవనం ఘనంగా ప్రారంభం

**- పజలకు ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన విహార కేంద్రం**



**బద్వేలు** ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం బద్వేలు పట్టణ ప్రజలకు ప్రకృతి సోయగాలను చేరువ చేస్తూ అభివృద్ధి చేసిన బద్వేలు నగరవనం ఘనంగా ప్రారంభించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో చంద్రమోహన్ , డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి , వైఎస్సార్ జిల్లా అటవీ అధికారి రాజశేఖర్ బాబు హాజరై నగరవనాన్ని ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు నగరవనాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నగరవనాన్ని సందర్శించి ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు మొక్కలను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.బద్వేల్ నగరవనంలో ప్రత్యేక ఆకర్షణలు:× సందర్శకుల కోసం ఆధునిక క్యాంటీన్× స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్.ఓ. వాటర్ సౌకర్యం× ఔషధ మొక్కలతో అభివృద్ధి చేసిన ఋషివనం× జ్యోతిష్య ప్రాధాన్యతతో రూపొందించిన నక్షత్రవనం× చిన్నారుల కోసం ఆకర్షణీయమైన చిల్డ్రన్స్ ప్లే జోన్× విశాలమైన పచ్చిక బయళ్లు (లాన్స్)× వివిధ వన్యప్రాణుల ప్రతిరూపాలతో వైల్డ్‌లైఫ్ పార్క్× సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు అందమైన పగోడాలు× ప్రకృతి మధ్య నడకను ఆస్వాదించే ట్రెక్కింగ్ ట్రాక్× వివిధ రకాల మొక్కలతో కూడిన నర్సరీ× ప్రకృతి వైవిధ్యాన్ని ప్రతిబింబించే అనేక రకాల వనాలుఈ నగరవనం కుటుంబ సమేతంగా సందర్శించడానికి, విద్యార్థులకు ప్రకృతి గురించి అవగాహన పెంపొందించడానికి, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించడానికి ఒక ఉత్తమ కేంద్రంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.జిల్లా అటవీ అధికారి శ్రీ రాజశేఖర్ బాబు సూచనలు, మార్గదర్శకత్వంలో బద్వేల్ నగరవనం అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయబడింది. ప్రజలందరూ ఈ వనాన్ని సందర్శించి పరిశుభ్రతను పాటిస్తూ, మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.ఈ నగరవనం రూపుదిద్దుకోవడంలో మాజీ జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్, దూరదృష్టి, ప్రణాళికాబద్ధమైన మార్గదర్శకత్వం, నిరంతర పర్యవేక్షణ, కృషి, అంకితభావం క్షేత్రస్థాయి కృషి విశేషంగా నిలిచాయని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. వీరి కృషి ఫలితంగానే బద్వేల్ నగరవనం నేడు ప్రజలకు అందుబాటులోకి వచ్చి బద్వేల్ పట్టణానికి ఒక ప్రత్యేక పర్యాటక, పర్యావరణ ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు.

## చదువును మధ్యలో ఆపవద్దు

**ఆసిఫాబాద్,**"చదువును మధ్యలో ఆపవద్దు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం" అని ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు విద్యార్థులకు పిలుపునిచ్చారు.గురువారం ఆయన టిడబ్ల్యూ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ఆసిఫాబాద్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతి నిర్వహించారు. ఉన్నత విద్య, కెరీర్ ప్రణాళిక, లక్ష్య సాధన, పోటీ పరీక్షల అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పదో తరగతి తర్వాత చదువు ఆపకుండా ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షల దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో విద్య ద్వారా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు.ఈ సందర్భంగా ఆంగ్ల భాషా నైపుణ్యాల కోసం వోకాబ్యులరీ ఆధారిత ఆటలను నిర్వహించి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు.అనంతరం ఆయన ఆసిఫాబాద్ యువజన శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణా కార్యక్రమాలను పరిశీలించారు. యువత ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, యువజన శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో డిప్యూటీ తాసిల్దార్

**ఏలూరు** లంచం తీసుకుంటూ మరో అవినీతి అధికారి ఏసీబీకి దొరికిపోయాడు. రూ20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి డిప్యూటీ తాసిల్దార్ చిక్కాడు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేసారు. × ఓ రైతు వద్ద నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు టిప్యూటీ తహసిల్దార్ వెంకటేశ్వరరావు పట్టుపడ్డాడు. టెక్కినవారి గూడెంకు చెందిన రైతును 50,000 డిప్యూటీ తహసిల్దార్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేసాడు. దాంతో రైతు పోతన సుకుమార్ం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రూ20.వేలు రూపాయలు లంచం తీసుకుంటుండగా డిప్యూటీ తహసిల్దార్ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## హాజీపూర్ తండాలో నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**- ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆదాయం పెంచాలి:**



**ఎల్లారెడ్డి** మండలం హాజీపూర్ తండా గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం సందర్శించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని, కంపోస్ట్ షెడ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడి, నర్సరీ నిర్వహణ, కంపోస్ట్ తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, మొక్కల పెంపకం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ,గ్రామ పంచాయతీ నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేసి, హరితహారాన్ని విజయవంతం చేయాలి. కంపోస్ట్ షెడ్లను సద్వినియోగం చేసుకుని సేంద్రీయ ఎరువుల తయారీని పెంచాలి. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ సాగును రైతులు విస్తృతంగా చేపట్టాలి. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సబ్సిడీలపై పూర్తి అవగాహన కల్పించాలి. గ్రామ స్థాయిలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీవో, వ్యవసాయ అధికారి, సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగురాళ్లలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల** :పిడుగురాళ్ల పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో వద్ద నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే



యరపతినేని తో పాటు పల్నాడు జిల్లా ప్రజారోగ్య సాంకేతిక అధికారి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) ఆర్ వి. శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్. ఆధామ్ షఫీ, మున్సిపల్ కమిషనర్ ఇరువురి శ్రీనివాసులు, పిడుగురాళ్ల తహసిల్దార్ మధుబాబు పాల్గొని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించటం జరిగింది. అనంతరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంపౌండ్ నందు మొక్కను నాటారు.

## కొలిమిగుండ్లలో స్మశాన వాటిక పనులు ప్రారంభం



కొలిమిగుండ్ల కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని ఎర్రవాగు వంకలో ఉన్న స్మశాన వాటిక ముళ్లపొదలతో నిండిపోవడంతో గ్రామ ప్రజలు ఈ సమస్యను టిడిపి నాయకుడు లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి ద్వారా కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి స్మశాన వాటికలో ఉన్న కంప చెట్లను జెసిబి సహాయంతో తొలగించాలని ఆదేశించారు. టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకుడు లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి జెసిబి ని ఏర్పాటు చేసి స్మశాన వాటిక పనులను ప్రారంభించారు. చాలా రోజుల తర్వాత స్మశానం వాటికలో పనులు ప్రారంభించడంతో ఇవాళ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, రవికుమార్, చంద్ర, గూలి రామచంద్రారెడ్డి, భాష, ఇంకా తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు, కుక్కర్ల పంపిణీ చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**- గత ప్రభుత్వ అప్పులు తీరుస్తూనే సంక్షేమ పాలన**

**- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ**



**వినుకొండ** పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని జాషువా కళా ప్రాంగణం నందు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి, 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని అంగన్వాడీ కేంద్రాలకు ఆధునిక వంట సామగ్రి (ఇండక్షన్ స్టవ్లు, కుక్కర్లు) పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జీవీ మాట్లాడుతూ, రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలు ఎంతో ఆదర్శవంతంగా నడుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు దొరికిన 'ఇడుపు కాయితం'

## - తెలంగాణలో మళ్లీ సెంటిమెంట్ రాజేసే ప్రయత్నాలు ఫలిస్తాయా?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం ఒక విచిత్రమైన ఎజెండా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. రాబోయే ఎన్నికల కోసం ప్రజలను ఆకట్టుకునే బలమైన సామాజిక, ఆర్థిక అజెండాలు లేదా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు తలమునకలవుతున్నాయి. అయితే, క్షేత్రస్థాయిలో చూపించడానికి కొత్త విషయాలేవీ దొరక్కపోవడంతో పార్టీలు మళ్లీ పాత, నమ్మకమైన 'తెలంగాణ సెంటిమెంట్ అస్త్రాన్నే భుజానికెత్తుకుంటున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పుష్కరం దాటిన తర్వాత కూడా ఇంకా తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, భాషపై దాడి జరుగుతోందని స్థానిక పాలకుల మీదే నిందలు వేసే రాజకీయాలు చేయడం నేటి తరం ఓటర్లను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది.

### సినిమా టైటిల్‌పై సోషల్ మీడియా ట్రోల్స్.. సెంటిమెంట్‌గా మార్చిన నేతలు!

ఈ సెంటిమెంట్ రాజకీయాలు ఏ స్థాయికి వెళ్లాయో చెప్పడానికి తాజా ఇడుపు కాయితం సినిమా వివాదమే ఒక పెద్ద ఉదాహరణ. నటుడు ప్రియదర్శి హీరోగా అచ్చమైన తెలంగాణ గ్రామీణ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్‌పై సోషల్ మీడియాలో ఎవరో ఇద్దరు నెటిజన్లు దీనికి ఆంధ్రాలో తెలుగు డబ్బింగ్ అవసరమా? అంటూ వ్యంగ్యంగా కామెంట్లు చేశారు. అసలు 'ఇడుపు కాయితం' అంటే తెలంగాణ యాసలో విడాకుల దరఖాస్తు లేదా ఆలుమగలు విడిపోయే ముందు రాసుకునే అంగీకార పత్రం అని అర్థం . కేవలం కొందరు నెటిజన్లు చేసిన వెకిలి చేష్టలను , అజ్ఞానపు ట్రోల్స్‌ను పట్టుకుని రాజకీయ పార్టీలు, మేధావుల బృందాలు దానిని ఏకంగా తెలంగాణ అస్థిత్వం, యాసపై ఆంధ్రా వాళ్ల దాడి అంటూ ఒక పెద్ద పొలిటికల్ ఇష్యూగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు.

### స్వపాలనలో ఆంధ్రాపై విమర్శలా?

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆంధ్రా పాలకులు-వలసవాదం అనే నినాదం ప్రజలను విపరీతంగా కదిలించింది. ఎందుకంటే అప్పట్లో అధికారం, నిధులు, నియామకాలు వేరే చేతుల్లో ఉండేవి. కానీ, రాష్ట్రం వచ్చి పుష్కరం దాటిన ఈ తరుణంలో ఇక్కడి సీఎం, మంత్రులు, అధికార యంత్రాంగం అంతా స్వచ్ఛమైన తెలంగాణ బిడ్డలే అయినప్పుడు ఇంకా ఆంధ్రా వలసవాదం అంటూ సెంటిమెంట్‌ను రాజేయడం హాస్యాస్పదంగా మారుతోంది. తెలంగాణలో జరుగుతున్న తప్పులకు లేదా పాలనా వైఫల్యాలకు ఇక్కడి పాలకులదే బాధ్యత కానీ ప్రతి చిన్న విషయానికి, చివరకు సినిమా టైటిల్ వివాదాలకు కూడా ఆంధ్రా ప్రాంతాన్ని లాగడం ప్రజలను కదిలించే అవకాశం లేదు. నేటి ఓటర్లు నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఐటీ వృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి క్షేత్రస్థాయి ఫలితాలను చూస్తున్నారే తప్ప సెంటిమెంట్ సెంటిమెంట్ అని రోజూ రొట్టె దంచితే వినే పరిస్థితిలో లేరని ఎక్కువ మంది భావిస్తున్నారు.

### ఆంధ్రా పార్టీలు ఉనికిలోనే లేవు.. మరి ఈ నినాదం వ్యూహాత్మక తప్పిదమా?

ప్రస్తుత తెలంగాణలో ఒకప్పుడు శాసించిన తెలుగుదేశం గానీ, వైఎస్సార్ కాంగ్రెస్ గానీ కనీసం ఉనికిలో కూడా లేవు. షర్మిలా పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైపోయింది. ఇక్కడ అధికారం కోసం పోటీ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఈ మూడు పార్టీల నేతలూ తెలంగాణ వారే. మరి శత్రువే లేనప్పుడు తెలంగాణ అస్థిత్వం ప్రమాదంలో పడింది ఆంధ్రా వాళ్లు దోచుకుంటున్నారు అనే నినాదాన్ని ఎత్తుకోవడం ముమ్మాటికీ రాజకీయ పార్టీల వ్యూహాత్మక తప్పిదమే అవుతుంది. శత్రువును సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే పాత చింతకాయ పచ్చడి వ్యూహాలు ఇప్పుడు పనిచేయవని అంచనా వేస్తున్నారు.

### సెంటిమెంట్ కాలం చెల్లింది.. కావాల్సింది ప్రగతి అజెండా!

ఒక సినిమా టైటిల్ మీదో, లేక ఎవరో యూట్యూబర్ చేసిన వ్యాఖ్యల మీదో ఆధారపడి రాష్ట్రంలో మళ్లీ ప్రాంతీయ విభేదాలు, అస్థిత్వ సెంటిమెంట్ రాజేసే ప్రయత్నాలు కేవలం పార్టీల సొంత రాజకీయ మనుగడ కోసమేనని నెటిజన్లు సోషల్ మీడియాలో కౌంటర్లు ఇస్తున్నారు. తెలంగాణ సమాజం ఉద్యమ కాలం నాటి భావోద్వేగాల నుండి ఎప్పుడో బయటకు వచ్చేసింది. గ్లోబల్ సిటీగా మారిన హైదరాబాద్ అభివృద్ధిని, యువత ఉపాధిని కాపాడుకోవడమే నేటి ప్రాధాన్యత. కాబట్టి రాజకీయ పార్టీలు ఇప్పటికైనా ఈ పాత సెంటిమెంట్ కార్డును పక్కనబెట్టి నిరుద్యోగ నివారణ, పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయ సంక్షేమం వంటి కంటికి కనిపించే ప్రగతి అజెండా తో వస్తేనే తెలంగాణ ప్రజలు ఆదరిస్తారు, లేదంటే ప్రజలే ఆ పార్టీలకు ఇడుపు కాయితం రాసిస్తారన్న అభిప్రాయాలు ఎక్కువ మంది వినిపిస్తున్నారు.

# అక్రమంగా మద్యం విక్రయాలు.. జేఆర్ దాబా సీజ్



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి రాజీవ్ రహదారి పై గత నెల 15-06-2026న సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా ప్రజ్ఞాపూర్ పరిధిలోని జేఆర్ దాబాపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో




అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై గజ్వేల్ పోలీసులు సంబంధిత నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం జేఆర్ దాబాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌కు లేఖ పంపించారు.పోలీసుల నివేదిక ఆధారంగా మున్సిపల్ కమిషనర్ విచారణ నిర్వహించగా, దాబాలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో జేఆర్ దాబాను సీజ్ చేసి మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత అధికారులు దాబాను సీజ్ చేసి కార్యకలాపాలను నిలిపివేశారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలి

## - ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాసిం వలి

**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు మండలం దేశవ్యాప్తంగా సార్( ఓటర్ల సర్వే) లో భాగంగా ఎమ్మిగనూరు పట్టణము, గ్రామీణ ప్రాంతాల్లో బిఎల్ వో లు. ప్రతి ఇంటికి ఓటర్ సర్వే చేయకుండా ఉంటున్నారని, సర్వేలో భాగంగా ఏ ప్రతి ఒక్క ఓటు( అర్హులైన) వారి తొలగించకూడదని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు కోఆర్డినేటర్ కాసిం వలి ఆధ్వర్యంలో తాహసిల్దార్ శ్రీనివాసులకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. సందర్భంగా వీరు మాట్లాడుతూ కొంతమంది బిఎల్ఓ మరియు అధికారులు రాజకీయ పార్టీ నాయకుల దగ్గర ఓటర్ల సర్వే ను నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భవనాల దగ్గరమరియు గుడి ,మసీదు ,చర్చి, ఓటర్ల సర్వేను చేయాలని కోరారు. ప్రతి వీధి వీధిలో సార్ ఓటర్ల అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటర్లకు, ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరేష్ యాదవ్,నరసప్ప, అజయ్ పాల్గొన్నారు..

# హాలహర్వి ఎంపీపీఎస్ స్కూల్లో రెగ్యులర్ టీచర్లు నియమించాలి

**ఎమ్మిగనూరు** నందవరం మండలం హాలహర్వి గ్రామంలో ఎంపీపీఎస్ స్కూలు ముందు ఆర్ ఏ వి ఎఫ్, పి ఆర్ ఎస్ వై ఎఫ్, పి ఎస్ యు విద్యార్థి సంఘాలు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు కృష్ణ రఘునాథ్ ఖాజా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా జిల్లాకు 2700 పోస్టులు ఇచ్చామని గొప్పలు చెప్పడం తప్ప జిల్లా మారుమూల గ్రామాలలో చాలా స్కూళ్లలో టీచర్ల కొరతమాత్రం అలాగే ఉందని వారు అన్నారు ముఖ్యంగా హాలహర్వి గ్రామంలో 160 మంది విద్యార్థులకు కేవలం ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుడే ఉండటం దుర్మార్గమని వారు అన్నారు అధికారులు తూతూమంత్రంగా ఇద్దరూ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేసి చేతులు దులుపుకోవడం సరైన చర్య కాదని వారు అన్నారు హాలహర్వి గ్రామంలో ఉపాధ్యాయుల కొరత వలన విద్యార్థులు టీసీలు తీసుకొని ప్రైవేట్ స్కూల్లో కి వెళ్లే పరిస్థితి నెలకొని ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా అధికారులు నాయకులు స్పందించి విద్యా హక్కు చట్టం ప్రకారం 1:30 రేషియో ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని అలాగే అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించకపోతే విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# టీఆర్ఎస్ నేతల అరెస్టు

**మేడ్చల్** ఉప్పల్ బాగాయత్లో నిర్వహించాలని నిర్ణయించిన భూపోరాట సభకు పోలీసులు అనుమతి లేకపోడంతో పాటు ముందస్తు అరెస్టులు చేపట్టిన నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు సభా వేదికను మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడెం ప్రాంతానికి మార్చారు.

బొల్లిగూడెంలో సభ నిర్వహణకు తెలంగాణ రక్షణ సేన నాయకులు టెంట్లు ఏర్పాటు చేయగా, సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అనుమతులు లేవని చెబుతూ టెంట్లను తొలగించారు. ఈ సందర్భంగా పోలీసులు, ఉద్యమకారుల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. భూపోరాటానికి ఉద్యమకారులు తరలివచ్చే అవకాశం ఉండటంతో బొల్లిగూడెం ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గూడూరులో 751 గ్రాముల గంజాయితో ముగ్గురు అరెస్ట్

**గూడూరు,** గూడూరు పట్టణంలోని పులకుర్తి క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ చింతలముని స్వామి ఆలయం సమీపంలో 751.20 గ్రాముల గంజాయితో ముగ్గురు వ్యక్తులను గూడూరు పోలీసులు అరెస్ట్ చేశారు.కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. తబ్రేజ్ సమాచారం మేరకు, గూడూరు ఎస్ఐ బి. రాజ కుళ్లయప్ప ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సీబీ షైన్ మోటార్ సైకిల్ (ఏపీ-39-బీఈ-7555)పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గెజిటెడ్ అధికారి మరియు స్వతంత్ర పంచాయతీదారుల సమక్షంలో సోదా చేపట్టారు. వారి వద్ద ఉన్న మూడు కవర్లలో మొత్తం 751.20 గ్రాముల గంజాయి లభ్యమైంది.ఈ సందర్భంగా గంజాయితో పాటు ఒక వివో మొబైల్ ఫోన్, గంజాయి రవాణాకు ఉపయోగించిన హీరో సీబీ షైన్ మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేసిన వారిలో గూడూరుకు చెందిన భక్త కృష్ణమూర్తి (40), పొన్నకల్ గ్రామానికి చెందిన బోయ వెంకట్రాముడు (58), ప్రస్తుతం గూడూరులో నివాసం ఉంటున్న సి.బెలగల్ మండలం బురందొడ్డి గ్రామానికి చెందిన బెస్త ఉదయ్ కుమార్ (20) ఉన్నారు.

నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని గూడూరు పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# దండుగులపై గళం మెత్తిన శ్రీ ఆంజనేయ యువజన సంఘం

- అలసిన పాదాలకు,అలుపేరగనీ పోరాటమే హైడ్రా రాక - హస్మత్ పేటలో పురావస్తు భూమి పరుల సొంతం
- "50"ఏళ్లుగా సర్వే నెం:1లో "138"ఎకరాల పురావస్తు శాఖకు చెందిన సర్కార్ భూమి మాయం చేసిన జాదుగాళ్లు
- హస్మత్ పేట చౌరస్తాలో ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ కి చెందిన జాగ ఒక ఎకరం 20 గుంటలు.అప్పట్లోనే తొలి తరం ఉద్యమకారులు నర్సయ్య,శ్రీనివాస్ రావు,తేళ్ళ నర్సింగ్ రావు, లక్ష్మణ్ గౌడ్ ప్రభుత్వ భూమి కబ్జా అవుతున్నట్లు ఆరోపణలు.
- దొడ్డి దారిలో అనుమతులు, దండుగ దోచుకున్న రెవెన్యూ, మున్సిపల్,రిజిస్ట్రేషన్ అధికారులు
- ముర్తుంజ్య మూర్తి. హస్మత్ పేట ప్రజలారా అందరు ఒకటి కావాల్సిన సమయం వచ్చింది.
- అన్యాక్రాంతం అయిన భూమి వివరాలు,వాస్తవాలు అధికారులకు వెల్లడించాలి: పప్పు పటేల్.







**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కూకట్ పల్లి నియోజకవర్గం** ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో గత ఎనిమిది రోజులుగా హైడ్రా వర్సెస్ ప్రైవేటు వ్యక్తులకు వార్ జరుగుతోంది.ఈ యుద్ధంలో అమాయకులు బలైపోతున్నారు.బాలనగర్ మండలం హస్మత్ పేట గ్రామంలోని సర్వే నెంబర్ 1 లో సుమారు ఒక ఎకరం 20 గుంటల పురావస్తు శాఖకు చెందిన భూమి స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తుల నుంచి సేవ్ చేయాలని తొలి తరం రజాకార్లను ఎదుర్కొన్న ఉద్యమకారులు చుక్క నర్సయ్య,మామిడి శ్రీనివాస్ రావు,తేళ్ళ నర్సింగ్ రావు, లక్ష్మణ్ గౌడ్ తదితరులు ఇరవై ఆరేళ్ళ క్రితమే విలేకరుల సమావేశంలో పేర్కొన్న విషయం విదితమే.ఈ జాగాలో డెభ్భై ఏళ్ల క్రితం పాఠశాల,వ్యాయామశాల ఉండేదని, అదే స్థలంలో స్థానిక దుండుగుల యాదగిరి
అనే వ్యక్తి ప్రైవేటు వ్యక్తులకు కొమ్ము కాశారని,అందుకే ఆ జాగాలో అతి పెద్ద అపార్ట్మెంట్ నిర్మాణం జరిగిందని శ్రీ ఆంజనేయ యువజన సంఘం ప్రతినిధులు ఆరోపించారు. హస్మత్ పేట గ్రామంలోని మూడు తరాల ప్రజల ఆస్తిని దోచుకున్న దొంగల వేట ఇక మొదలైంది.ఇది చివరి ప్రయత్నం అందుకనే అందరు కలిసి గ్రామ రూపు రేఖలను హైడ్రా అధికారులకు వివరించాల్సిన సమయం ఆసన్నమైందని శ్రీ ఆంజనేయ యువజన సంఘం అధ్యక్షుడు ముర్తుంజ్య మూర్తి తెలిపారు.

### బోయిన్ పల్లి డివిజన్‌లో హైడ్రా :

1953 జూన్ 11 వ తేదీన పురావస్తు శాఖకు చెందిన సర్వే నెంబర్ 1 లో సుమారు 138 ఎకరాల స్థలంలో ఇద్దరు వ్యక్తులకు సుమారు 28 ఎకరాలకు పట్టా భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.ఆ ఇరవై ఎనిమిది ఎకరాల స్థలం పోగ మిగిలిన 108.ఎకరాల ఇరవై ఎనిమిది గంటల భూమి ప్రభుత్వానిదే అని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.అదిగాక 1980 సంవత్సరానికి ముందు 30 ఎకరాల్లో స్థానిక ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారు.హస్మత్ పేట గ్రామం ఏర్పడక ముందే ఈ భూమి ప్రభుత్వానిదేనని.
అప్పట్లోనే కొంతమంది కబ్జా దారులు కొంత కొంత సర్కార్ జాగను కబ్జాకు తెగ పడ్డారు.ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు, నేతలు ఆక్రమణదారులతో చెయ్యి కలపడం,కంచెను చేను మేసి నట్లుంది.అందుకేపురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న స్థలం కథా కూడా ఇంచుమించు అలానే ఉంది.ఆ గవర్నమెంట్ జాగకు హద్దులు సరిహద్దులు లేకపోవడమే ఓ కారణం.

### శ్రీ ఆంజనేయ యువజన సంఘం ప్రతినిధులు ఆరోపణలు :

ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడానికి ముఖ్యమైన వ్యక్తి దండుగుల యాదగిరి అని వారు ఆరోపిస్తున్నారు.ఈ వ్యక్తి వల్లనే ఎకరాల స్థలాలు పరుల సొంతం అయిపోతున్నాయి.మరో విషయం ఏమిటంటే హస్మత్ పేట చౌరస్తాలో ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ కు చెందిన ఎకరం 20 గుంటల స్థలంలో తప్పుడు పత్రాలతో అనుమతులు పొందిన ప్రైవేటు వ్యక్తులకు పూర్తి స్థాయిలో సహకరించిన దండుగుల యాదగిరికి ఆబడా బాబులు ఆ భారీ అపార్ట్మెంట్ లో రెండు, మూడు ప్లాట్లు కానుకగా ఇచ్చారు.అలాగే ఈ మధ్య
"నల్ల పోచమ్మ "దేవాలయం నిర్మాణం చేసిన స్థలం కూడా ఆ అస్మదీయులు ఆయనకు ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని శ్రీ ఆంజనేయ యువజన సంఘం ఉపాధ్యక్షుడు పప్పు పటేల్ ప్రశ్నించారు.గత పదేళ్ళుగా ఎటువంటి మౌళిక సదుపాయాలు లేని అపార్ట్మెంట్ కు అడ్డదారిలో మంచినీటి సౌకర్యంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేశారని శ్రీ ఆంజనేయ యువజన సంఘం అధ్యక్షుడు ముర్తుంజ్య మూర్తి ఆరోపించారు.అలాగే ఛత్రీ స్థలంలో బోయిన్ పిల్లికి చెందిన పలువురు అమాయకులకు ప్రభుత్వ భూములు అప్పనంగా లక్షల్లో విక్రయాలు చేపట్టారని సంఘం ప్రతి నిధులు తెలిపారు.అలాగే అన్యాక్రాంతం అయిన భూములు,స్థానిక నేతలు వివరాలు హైడ్రా కమీషనర్ రంగనాథ్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.
బోయిన్ పల్లి ప్రాంతానికి చెందిన యువతకు క్రీడ మైదానం లేక నానారకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి.హైడ్రా ఆధీనంలో ఉన్న స్థలంలో స్థానిక ప్రజలకు పెద్ద గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కమీషనర్ నీ కోరుతున్నట్లు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.గవర్నమెంట్ భూములను చర పట్టిన వ్యక్తులు ఎంత పెద్ద వారైనా ఉపేక్షించ కుండా వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### తప్పుడు పత్రాలతో గుడి జాగ,చిన్న తూం స్థలం, బోయిన్ చెరువు ఆనుకొని ఉన్న దేవాలయం కబ్జా : దుండుగుల యాదగిరి.

శ్రీ ఆంజనేయ యువజన సంఘం ప్రతినిధులు పై పలు ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ టిపిసిసి సెక్రటరీ దండుగుల యాదగిరి.మొదటిది శ్రీ ఆంజనేయ స్వామి గుడికి చెందిన మాన్యం (భూమి) దుబాయ్ గేట్ లో ఉన్న స్థలంలో ఫేక్ దస్తావేజులు సృష్టించి సొంత భవనం కట్టుకున్నది ఎవరు ?రెండవది బోయిన్ చెరువుకి చెందిన చిన్న తూం ఆనుకొని ఎవరు కబ్జా చేశారో, మూడవది చెరువుని ఆనుకొని ఉన్న కట్ట మైసమ్మ దేవాలయం ముసుగులో కబ్జా చేసి ప్రైవేటు వ్యక్తులకు కిరాయికి ఇచ్చింది ఎవరో అందరికి తెలుసు అని నా జోలికి వస్తే అందరి జాతకాలు బయట పెడుతాను, వ్యక్తి గత దూషణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని దండుగుల యాదగిరి తెలిపారు.

# కాసుల కక్కుర్తితో నరరూప రాక్షసత్వం

## – మటన్‌లో ఎద్దు మాంసం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మనం బ్రతకడానికి తింటున్నామా? చావడానికి తింటున్నామా? బయట రోజురోజుకూ పెరిగిపోతున్న తిండి కల్తీలను చూస్తుంటే సామాన్యుడికి ఒళ్లు గగుర్పొడవడం ఖాయం. ఒకప్పుడు హైదరాబాద్ బిర్యానీ అన్నా, ఇక్కడి మటన్ వంటకాలన్నా దేశవ్యాప్తంగా భోజన ప్రియులు లొట్టలేసుకుని తినేవారు. కానీ, కొందరు కాసుల కక్కుర్తి పడ్డ నరరూప రాక్షసులు మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మొన్నటికి మొన్న మటన్ పేరుతో కుక్క మాంసం అమ్మిన ఘోరాలు మరువకముందే.. తాజాగా భాగ్యనగరంలో మటన్ పేరుతో ఎద్దు మాంసం విక్రయిస్తున్న మరో ముఠా గుట్టు రట్టయింది. మీరు హోటళ్లలో వేల రూపాయలు పోసి ఆర్డర్ ఇచ్చుకుని తింటున్నది అసలు మేక మాంసమేనా? లేక మరేదైనా జంతువుదా? అనే అనుమానాలు ఇప్పుడు నగరవాసులను పట్టి పీడిస్తున్నాయి.హైదరాబాద్ నగరంలోని హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లి ప్రాంతంలో ఈ భయంకరమైన కల్తీ మాంసం దందా వెలుగుచూసింది. ఇక్కడి 'ఉస్మాన్ మీట్ షాప్' నడుపుతున్న ఉస్మాన్ ఖురేషి అనే వ్యక్తి.. మేక మాంసంలో ఎద్దు మాంసాన్ని యథేచ్ఛగా కలుపుతూ తక్కువ ధరకు నగరంలోని పలు హోటళ్లకు సరఫరా చేస్తున్నాడు. దీనిపై స్థానికులకు అనుమానం వచ్చి అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు రంగు బయటపడింది. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక హబీబ్‌నగర్ పోలీసులు కలిసి సదరు మటన్ షాపుపై మెరుపు దాడి చేశారు.




### 50 కిలోల కల్తీ మాంసం స్వాధీనం.. ల్యాబ్‌కు నమూనాలు!


అధికారులు షాపులోకి అడుగుపెట్టి తనిఖీలు చేయగా అక్కడ విక్రయానికి ఉంచిన మాంసాన్ని చూసి అధికారులకే మైండ్ బ్లాంక్ అయింది. అది మేక మాంసం కాదని ప్రాథమికంగా గుర్తించిన అధికారులు, షాపును జల్లెడ పట్టగా ఏకంగా 50 కిలోల కల్తీ (ఎద్దు) మాంసం బయటపడింది. దీంతో వెంటనే ఆ మాంసాన్ని సీజ్ చేసి, నిందితుడు ఉస్మాన్ ఖురేషిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన మాంసం నమూనాలను సేకరించి తదుపరి విచారణ కోసం ల్యాబొరేటరీకి పంపించారు. ల్యాబ్ నివేదిక రాగానే నిందితుడిపై అత్యంత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.



### అసలు కల్తీ లేని వస్తువు ఏది? ప్రజల్లో తీవ్ర ఆగ్రహం!

అసలు నగరంలో కల్తీ లేని వస్తువు అంటూ ఏదైనా ఉందా? అని ప్రజలు తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. పొద్దున లేస్తే తాగే పాలు కల్తీ వంట చేసుకునే ఆయిల్ కల్తీ, బిర్యానీల్లో వేసే అల్లం-వెల్లుల్లి పేస్ట్ కల్తీ ఆఖరికి ముక్క లేనిదే ముద్ద దిగని మాంసాహారుల బలహీనతను ఆసరాగా చేసుకుని మటన్‌ను కూడా కల్తీ చేస్తారా? అంటూ నగరవాసులు మండిపడుతున్నారు. ఈ ఘోరం అసలు ఎంతకాలంగా సాగుతోంది? ఏయే హోటళ్లకు ఈ కల్తీ మాంసాన్ని సరఫరా చేశారు? అనే కోణంలో పోలీసులు ప్రస్తుతం లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. హోటళ్లలో లొట్టలేసుకుని తినేముందు ఒక్కసారి ఆలోచించుకోవాల్సిన భయానక పరిస్థితి ఇప్పుడు హైదరాబాద్‌లో నెలకొంది.

# వరంగల్ నూతన పోలీస్ కమిషనర్‌గా శ్వేత



వరంగల్(ప్రశ్న న్యూస్)రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్‌గా 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఎన్. శ్వేత నియమితులయ్యారు.
ఇప్పటి వరకు వరంగల్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సన్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. శ్వేతను వరంగల్ సీపీగా నియమించింది.పోలీస్ శాఖలో సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందిన ఎన్. శ్వేత, వివిధ కీలక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం కలిగి ఉన్నారు. తాజా బదిలీలతో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో కొత్త నాయకత్వానికి శ్రీకారం చుట్టినట్లైంది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమె త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ం

# తిరుమల శ్రీవారి ఆశీస్సులు పొందిన మంత్రి నారా లోకేష్

## – తిరుప్పావడ సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు

## టీటీడీ అధికారులు ఘన స్వాగతం




తిరుమల(ప్రశ్న న్యూస్) రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావడ సేవలో పాల్గొని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు పొందారు.మంత్రి లోకేష్ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ మార్గం ద్వారా ఆలయంలోకి చేరుకోగా మహాద్వారం వద్ద తో పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు.అనంతరం తిరుప్పావడ సేవలో పాల్గొన్న మంత్రి లోకేష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు, వేదాశీర్వచన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షురాలు , ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్.. పేరు గొప్పా.. పని శూన్యమా.?

- అవినీతి అధికారులకు అండగా వ్యవస్థ మారిందా.?
- విచారణలు జరుగుతున్నాయా.? లేక ఫైళ్లు మూలన పడుతున్నాయా.?
- నివేదికలు రాస్తే సరిపోతుందా.? చర్యలు ఎవరు తీసుకుంటారు.?
- అవినీతిపరులతో విజిలెన్స్ అధికారుల లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయా.?
- విజిలెన్స్ అంటే భయం లేదు, అవినీతి చేసిన లెక్కలేదు కారణం.?
- అవినీతి అధికారులపై కఠిన చర్యలు లేకనా.? లేక డబ్బుతో మేనేజ్ ఆ

**(ఆర్ కె -- ప్రశ్న న్యూస్ బ్యూరో)**

ప్రభుత్వ అధికారులు, సిబ్బందిలో అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజిలెన్స్ వ్యవస్థ నేడు తన ఉనికినే ప్రశ్నించుకునే పరిస్థితికి చేరుకుందా.? తెలంగాణలో ప్రభుత్వ శాఖల్లో అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంపై ప్రజలు వరుసగా అనేక ఫిర్యాదులు చేస్తున్నా వాటిపై చర్యలు ఎందుకు కనిపించడం లేదు.? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వం మాత్రమే కాదు, విజిలెన్స్ వ్యవస్థ ఉన్నత అధికారి కూడా.విజిలెన్స్ అధికారులు విచారణలు చేస్తారు. నివేదికలు తయారు చేస్తారు. అంతటితో కథ ముగుస్తుందా.? ఆ నివేదికల ఆధారంగా ఎంతమంది అవినీతి అధికారులు సస్పెండ్ అయ్యారు.? ఎంతమందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.? ఎంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించారు.? ఈ వివరాలను విజిలెన్స్ చీఫ్, తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు వెల్లడించే ధైర్యం ఉందా.?ప్రభుత్వ శాఖల్లో కొందరు అధికారులు ప్రభుత్వ నియమ నిబంధనలోనూ గాలికి వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. అయినప్పటికీ అదే అధికారులు సంవత్సరాల తరబడి అదే కుర్చీల్లో కొనసాగుతుండడం యాదృచ్ఛికమా.? లేక వ్యవస్థలో కొంతమంది అధికారులు అవినీతికి రక్షణ కవచంగా ఏర్పడ్డారా.? అనే అనుమానాలు బలపడుతున్నాయి.ప్రజలు విజిలెన్స్‌ను ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందని నమ్ముతారు. కానీ ఫిర్యాదు చేసిన తర్వాత నెలలు, సంవత్సరాలు గడిచినా అవినీతి అధికారులపై ఎలాంటి చర్యలు లేకపోతే ప్రజలు ఎవరిని నమ్మాలి.? విజిలెన్స్ కార్యాలయం ప్రజల కోసం పనిచేస్తుందా.? లేక కేవలం రికార్డుల కోసం మాత్రమే నడుస్తుందా.?మరోవైపు విజిలెన్స్ అధికారుల్లో కొందరు అవినీతి అధికారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు అసత్యమైతే ప్రభుత్వం వాటిని ఖండించాలి. నిజమైతే అలాంటి అధికారులపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే విజిలెన్స్‌పై ప్రజల్లో ఉన్న మిగిలిన నమ్మకం కూడా పూర్తిగా దెబ్బతింటుంది. కానీ విజిలెన్స్ ఉన్నత అధికారులు అలా చేసిన దాఖలాలు లేవు. అవినీతి అధికారులు గల్లా ఎగరవేసుకుంటూ యదేచ్ఛగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు.విజిలెన్స్ నివేదికలు ఉన్నతాధికారుల టేబుళ్లపై దుమ్ము పట్టే ఫైళ్లుగా మారితే ఆ వ్యవస్థను కొనసాగించడం వల్ల ప్రజలకు ఉపయోగమేంటి.? విచారణలు చేసి నివేదికలు రాసి అల్మారాల్లో పెట్టడానికే విజిలెన్స్ శాఖ ఉన్నట్లయితే ప్రజాధనంతో కోట్ల రూపాయలు ఖర్చు చేయడంలో అర్థమేంటి.? ప్రభుత్వ పాలనలోఅవినీతి అధికారులను కాపాడే పరిపాలన చివరికి ప్రభుత్వ ప్రతిష్ఠనే దెబ్బతీస్తుందని పాలకులు మర్చిపోతున్నారు. ఇలాంటి వాళ్లతో నిజాయితీగా పనిచేసే అధికారుల ఉత్సాహాన్ని చంపేస్తుంది. ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తుంది. అందుకే విజిలెన్స్‌ను కేవలం పేరుకే కాకుండా కఠిన చర్యలు తీసుకుని వ్యవస్థగా మార్చాల్సిన సమయం రేవంత్ రెడ్డి సర్కార్ పై ఉంది. ఇప్పటికే ప్రజలలో విజిలెన్స్ విభాగం అంటేనే అత్యంత చులకన భావం ఏర్పడింది ఫిర్యాదులు చేయడానికి కూడా ప్రజలు ముందుకు రాకపోవడం చూస్తుంటే ప్రజలలో ఎంత అపనమ్మకం ఏర్పడిందో పాలకులు అర్థం చేసుకోవాలి.ప్రతి విజిలెన్స్ నివేదికపై నిర్దిష్ట గడువులో చర్యలు తీసుకోవాలి. అవినీతి అధికారులపై సస్పెన్షన్, శాఖాపరమైన విచారణ, క్రిమినల్ కేసులు వంటి కఠిన చర్యలు తప్పనిసరి చేయాలి. చర్యలు తీసుకోని ఉన్నతాధికారుల బాధ్యతను కూడా నిర్ధారించి వాళ్ళని తొలగించాలి.లేకపోతే ప్రజలలో విజిలెన్స్ విభాగం నిజంగా అవినీతిని అరికట్టేందుకా.? లేక అవినీతిని కప్పిపుచ్చేందుకా.? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉన్నత అధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి దే.




# టీఎంసీలో చీలిక..

# ఇరు పక్షాలకు ఈసీ నోటీసులు



(ప్రశ్న న్యూస్)టీఎంసీ నేత రితబ్రత బెనర్జీ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం స్పందించింది. ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఎన్నికల గుర్తుతో పాటు టీఎంసీ నాయకత్వం తమదే అంటూ ఇరు వర్గాలు ప్రకటించుకున్న నేపథ్యంలో ఈసీ గురువారం ఈ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తు, బ్యాంక్ అకౌంట్లు, పార్టీ కార్యవర్గం, ఇతర వ్యవస్థల విషయంలో జులై 6 లోపు పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని కోరింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి తరువాత రితబ్రత సారథ్యంలో ఒక వర్గం తిరుగుబాటు బావుటా ఎగరవేసిన విషయం తెలిసిందే. మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నాయత్వాన్ని అంగీకరించేది లేదని రితబ్రత తేల్చి చెప్పారు. అంతేకాకుండా, పార్టీకి ఉన్న 80 మంది ఎమ్మెల్యేల్లో 65 మంది తనకు మద్దతుగా ఉన్నారని అన్నారు. అసెంబ్లీలో ఇప్పటికే టీఎంసీ ఎమ్మెల్యేలు రితబ్రతను తమ లీడర్‌గా ఎన్నుకున్నారు. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు తనకే ఉన్నందున తమ వర్గాన్ని అసలైన టీఎంసీగా గుర్తించాలని రితబ్రత కోరుతున్నారు. అయితే, మమత మద్దతుదారులు మాత్రం ఈ వాదనను కొట్టిపారేస్తున్నారు. పార్టీ వ్యవస్థాగత బలమే నాయకత్వాన్ని నిర్ణయిస్తుందని అన్నారు. ఇప్పటికీ టీఎంసీ నేత మమతయేనని అంటున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588